ఆంధ్ర మహిళ

మైలాపూరు :: డిసెంబరు 1946 :: మదరాసు

: ముఖచిత్రం :

బరంపురం మహిళా సమాజ వార్షికోత్సవ సందర్భమున
సమాజ విద్యార్థినుల భారతమాత స్తుతి.

సంవత్సర చందా ★ అయిదు రూపాయలు



— మా హాస్టల్ వార్షికోత్సవం —

శ్రీమతి అల్లాడి వెంకటలక్ష్మిగారు (అధ్యక్షులు), కార్య నిర్వాహకవర్గం, విద్యార్థినులు.

సంపుటి – 3   సంచికలు — 13, 14.

1. విద్దోకాలు — VIDDOKOLU
2. ఆస్ట్రేలియన్ తొలి స్త్రీవాద కారిణి ఉద్యమ ప్రాయం.
3. బలి దానం — BALI DHANAM.
4. రెక్కగాయు — శ్రీమతి లక్ష్మి నాయమ్మ
5. సింహాచల యాత్ర — శ్రీమతి యస్. కామేశ్వరి
6. ఆంధ్ర స్త్రీల విద్య భావన
7. సైకిలు — కొండేపూడి శ్రీనివాసరావు.
8. మహిళల్లో జాగృతి — MAHILALLO JAGRUTI.
9. గాంధీజీ విజయాలు.
10. కుష్ఠు రోగుల సేవ.
11. స్త్రీ స్వాతంత్ర్యము ప్రగతి — శ్రీమతి డి. దుర్గావతి దేవి.
12. నిర్మల దేవి గ్రంథాలయము.
13. విశ్వ ప్రపంచ యాత్ర — శ్రీమతి పి. హెచ్. గోవిందా దేవి.
14. వేదాంతము
15. వనిత స్త్రీల జీవితం — శ్రీమతి మంత్రిప్రగడ రంగ నాయకమ్మ

ఆంధ్రమహిళ

సంపుటి 3 | డిసెంబరు 1946 | సంచికలు 13, 14

"నేటినుండి ఆంధ్ర మహిళాసభ దైనందిన కార్యక్రమంలో నా బాధ్యత ముగిసింది. ఆరు సంవత్సరముల క్రితం పిల్లల క్లబ్బుగా పుద్భవించిన దీనిని పెంచి అద్వితీయమైన మహిళా సంస్థగా పోషించిన యితర కార్యవర్గ సభ్యులతో నేనూ విరమిస్తున్నాను. ఆంధ్ర మహిళ సంపాదకత్వంగూడా విడిచిపెట్టినట్టే. అది ప్రభుత్వంతో సంబంధించిన విషయం కాబట్టి సంపాదకురాలుగా నా పేరు యింకా కొన్నినెలలు వెలువడవచ్చు. నిజానికి యీ సంచికనుండే సోదరీమణులు పూర్తి బాధ్యత వహించారు. ఆంధ్ర మహిళాసభ యొక్కయు, ఆంధ్ర మహిళయొక్కయు భవిష్యత్తును వారు సుస్థిరంగా కాపాడగలరు.

—దుర్గాబాయి.

ది 1-12-46 వ తేదీన జరిగిన ఆంధ్ర మహిళాసభ సర్వ సభ్య సమావేశంలో యేకగ్రీవంగా ఆమోదింపబడిన తీర్మానాలు

1. ఆంధ్ర మహిళాసభయొక్క చరస్థిరాస్తులను సభయొక్క లాభమునకు, ప్రయోజనసిద్ధికి, అదర్శప్రాప్తికి వ్యవహరించుటకుగాను యింతకు పూర్వమే ఒక ధర్మకర్తృత్వ సంఘమును నియోగించడమైనది. ఆ ధర్మకర్తృత్వ సంఘమునకు అధికారమిస్తూ వ్రాసి రిజిస్టరీ చేయింపబడనున్న ధర్మకర్తృత్వాధికార పత్రమును చదివి ఆంధ్ర మహిళాసభయొక్క యీ సర్వ సభ్య సమావేశము వారు ఆమోదించడమైనది. ఈ ఆమోదింపబడిన ధర్మకర్తృత్వాధికార పత్రములో లాయర్ల సలహా ప్రకారము యేమైన మార్పులు చేయవలసినయడల ఆంధ్ర మహిళాసభ తరఫున అట్టి మార్పులను చేయుటకును, ఆ పత్రమును రిజిస్టరీ చేయుటకును, దానికి సంబంధించిన అవసర చర్యలన్నిటినీ తీసికొనుటకును శ్రీమతి ఎ. చన్నఘంటమ్మ కృష్ణారావుగారికి యీ సర్వసభ్య సమావేశమువారు అధికారమీయడమైనది.

2. ఆంధ్ర మహిళాసభ, ఆంధ్ర మహిళల బ్యాంకు ఎక్కౌంటును వ్యవహరించుటకుగాను శ్రీమతి దుర్గాబాయమ్మగారి స్థానే శ్రీమతి జె. జమునాబాయిగారు, ఆంధ్ర మహిళాసభ కార్యదర్శిగాను, ఆంధ్ర మహిళ మేనేజరుగాను వ్యవహరించుటకు వారికి అధికారమీయడమైనది.

★

వీడ్కోలు

ఆవేళ డిసెంబరు 5వ తేదీ, అనుకుంటూ వుండగానే యిట్టే వచ్చేసింది. మా దుర్గాబాయమ్మగారు కాన్‌స్టిట్యూయంట్ ఎస్సెంబ్లీకి మెంబరుగా ఢిల్లీకి మద్రాసులో రైలెక్కే రోజు అది.

ఆంధ్ర మహిళాసభ కార్య నిర్వాహకవర్గం, సభ్యులు, విద్యార్థినులు, ఇంకా ఊళ్లో పెద్దలూ వద్దన్నా మళ్లీ రైలు దగ్గరకు తయారయ్యేరు, ఏకధారగా వర్షం పడ్తూన్నా — వీడ్కోలిచ్చి దిగ్విజయంగా వెళ్లిరండని పంపించడానికి. బిడ్డ, సోదరి, గురువు, స్నేహం బంధువుగా వీరిని భావించేవారంతా యీ కొద్ది కాలపు ఎడబాటుకు కూడా సహించలేక కన్నీటితో వీడ్కోలిచ్చేరు, "వెళ్లిరండి, దేశంలో ఘనకార్యాలు జరుగబోతున్నాయి. మీతో కొంతకాలం బాటు వియోగం మాకు భరింపరానిదైనా దేశసేవకై వెళుతున్నారు గనుక ఎలాగో ఓర్చుకుని ఉంటాం" అన్న భావాలు అంతఃకరణలో తోస్తున్నాయి, కాని కళ్ల నీరు గమ్మకుండా వెళ్లిరండని చెప్పగలిగినవారు ఆ సమూహంలో ఎవరూ లేరు. ఆమె కూడా ప్రతీవార్ని పేరు పేరు వరుసని ఆదరించి మీ మీ విధులు శ్రద్ధగా నిర్వర్తించండి, విద్యార్థినులు జాగ్రత్తగా చదువుకోండని హెచ్చరించి సెలవు తీసుకుంటున్నారుగాని, లోపలమాత్రం బిడ్డల్ని విడిచి వెళ్లేతల్లిలాగ పడుతున్న అవస్థ మాటా ద్యోతకమౌతూనేవుంది. ఇకమీదట సభ బాధ్యత మీదే, పూర్తిగా మీదే అన్నమాటలు మా చెవుల్లో రింగుమన్నాయి.

ఇట్టే 8 గంటలయ్యేసరికి, "జై దుర్గాబాయమ్మగారికి" అన్న జయ జయ ధ్వని చేద్దామని తలచుకుంటూండగానే ఢిల్లీ ఎక్స్‌ప్రెస్ మాత్రం ఒక్క ఈలవేసి ఢిల్లీ చలో అని తుర్రున పరుగెత్తింది!



అంతా అలా చూస్తూనే నిలబడిపోయేం....... చూచి చూచి తిరిగి బసకుచేరుకున్నాం.

ఆవేళ—ఆ వీడ్కోలు, ఆ ముఖాలు—ఆ దృశ్యం — ఆమె తిరిగి వచ్చి మాసభని అలంకరించేదాకా ఎట్లా మర్చిపోగలం. దుర్గాబాయమ్మగారే ఆంధ్ర మహిళా సభ, ఆంధ్ర మహిళా సభే దుర్గాబాయమ్మగారు అయినారు గనుక ఇంత పరితాపం. వారి సంకల్పమే ఈ సభ. ఈ సభ భవనాల శంకుస్థాపనరోజున రాజగోపాలాచారి గారన్న మాటలు ఎప్పటికీ నిశ్చయమే. "దీనికంతకూ కారణం దుర్గాబాయమ్మ అనేడు శక్తి—ఒరు పెరియాశక్తి యిరుకుదు!" అన్నారాయన!

వీరూ, వీరిప్పుడు పాల్గొనవెళ్లిన కాన్‌స్టిట్యూయంట్ ఎస్సెంబ్లీ దిగ్విజయంగా స్వతంత్ర భారత దేశానికి శాశ్వత పునాదులు వేయగలరని అంతా ప్రార్థిస్తూ ఆమె రాకకై ఎదురుచూస్తున్నాం. (కె. సు.)

★

ఆస్తిహక్కు లేని గృహాధికారం బుద్బుదప్రాయం!

శ్రీమతి టి. సీతమ్మ, వై. జయలక్ష్మి, కె. సుశీల,
రత్నమ్మ, కె. సుగుణమణి, పి సరస్వతి

★ ★

అధ్యక్షురాలు:

శ్రీమతి మామిడిపూడి వెంకమ్మగారు

ఆంధ్ర మహిళాసభ తెలుగు వాగ్వివాదశాఖ సమావేశము శ్రీమతి మామిడిపూడి వెంకమ్మగారి అధ్యక్షతను జరిగింది. "స్త్రీలకు ఆస్తియందు పురుషులతో సమాన హక్కులుండవలెను" అన్న విషయము గురించి చర్చ జరిగింది.

టి. సీతమ్మగారు (matric విద్యార్థిని) స్త్రీలకు ఆస్తిలో హక్కు లేకపోతే చాలా నిరాధారులు అవుతారు. తన స్వంతంగా తను ఖర్చు పెట్టుకోవాలంటే వీలుండదు. పెళ్లి చేశాం కదా, మన బాధ్యత యికమీదట లేదని పుట్టింటివారు వూరుకుంటారు. చేసుకున్న భర్త, అత్తవారు, మంచివారయితే తప్ప, లేకపోతే పెళ్లిలో, అత్తవారు, పుట్టింటివారు పెట్టిన నగలుకూడా అమ్ముకుంటారు. మేం పెట్టినవే కదా అంటారు. అప్పుడు వారికి స్వాధీనం కాని ఆస్తి కనుక ఆ పిల్లకు వుంటే యీ బాధవుండదు. ఇది యిల్లా వుండగా పిల్ల అదృష్టం తిన్నగా లేనిదై, భర్త పోవటమో, వదిలిపెట్టడమో తటస్థిస్తే ఆ అవస్థ మరీ ఘోరం. స్వతంత్రంగా ధనం కావాలంటే చదువుకుని ఉద్యోగం చెయ్యాలి. చదువుకు డబ్బు కావాలి. ఆ డబ్బు యింకొకరు యివ్వాలి. ఇంకొకరి దగ్గఱనుంచి తీసుకోటం మనస్సుకు బాధగా వుంటుంది, ఆస్తి కనక వుంటే యీ అవస్థలుండవు. కనక అంతంత కట్నా లిచ్చే బదులు దాంతో ఆ పిల్లకు కొంత ఆస్తి యివ్వడం పద్ధతివుంటే బాగుండును. ఆస్తిలో హక్కు మొగవారితోపాటు వుంటే యీ బాధయేమీ వుండదు అని విరమించారు.

వై. జయలక్ష్మి (Sub-Sub-Junior) సీతమ్మగారి వాదనను సమర్థిస్తూ ఆస్తిలో హక్కు కావాలి అని చెప్పినది. ఎల్లాంటి యిబ్బందులు వచ్చినా, ఆస్తి కనక వుంటే స్వతంత్రంగా బ్రతకవచ్చు. ఒకరి మీద ఆధారపడ నవసరం లేదని విరమించింది.

కె. సుశీలగారు పై యిద్దరి వాదనను ఖండించుచూ స్త్రీలకు ఆస్తి హక్కు అనవసరం. ఎందువల్లననగా శాస్త్రరీత్యా స్త్రీ చేతులో డబ్బు నిలవదు. అవసరం లేని ఖర్చులు యెన్నో చేస్తారు. తనే ఖర్చు పెట్టాలి, ఆ డబ్బు తనదే అవటం యెందుకు? అన్ని హక్కులు లేవనుకోటం తప్ప, లేని దేమిటి? ఒక సంసారంలో భార్యని కాదని భర్త యేం చెయ్యగలడు? ఆ పురుషుడు చేత చేయించే శక్తి కావాలి గాని హక్కు వచ్చి యేం లాభం. మన కోరికలకు అంతం లేకండా వుంది. పురుషుడుతోపాటు అన్నీ కావాలన్న కోరికలు మరీ యెక్కువ అయిపోతున్నాయి. కనక స్త్రీకి ఆస్తిలో హక్కు అంత అవసరం కాదని నా అభిప్రాయం అన్నారు.

శ్రీమతి రత్నమ్మ, సుశీలగారిని సమర్థిస్తూ మనకి యీ మధ్యమరీ అది కావాలి, యిది కావాలి అనటం కొత్త కొత్త శాసనాలు, B. N. Rao Committee మొదలైన కమిటీలు యేర్పరచటం ఫాషన్ అయిపోయింది. స్త్రీ కార్యరంగమే వేరు. పురుషుడు కార్యరంగమే వేరు. స్త్రీకి డబ్బు, ఆస్తి అవసరం యేమిటి? తన పనంతా గృహం చక్కదిద్దటంలోనే, అందుకు తగినవన్నీ సమకూర్చే బాధ్యత పురుషుడిదే కనక ఆస్తిలో హక్కు అవసరం లేదన్నారు.

కె. సుగుణమణిగారు పై యిద్దరిని ఖండించుచూ, మొదటి వారిని సమర్థిస్తూ ఆస్తి హక్కు స్త్రీలకు అవసరం అన్నారు. ముఖ్యంగా మనం, యేదయినా మార్పు కావాలంటే, యిదివరకు పరిస్థితి యేమిటి అని చూడాలి. ఇదివరకు హక్కు వుందా? లేదు. మరి యిప్పుడు యెందుకు?

ఇదివరకు స్త్రీలు సుఖంగా లేరూ? అంటే, అప్పటి పురుషులు స్త్రీని పూజించేవారు. వారుకూడా ఆ పూజకు అర్హులుగానూ వుండేవారు సమానంగానూ వుండేవారు. రాను రాను పురుషులకు యీర్ష్య, అహంభావం యెక్కువ అయిపోయాయి. స్త్రీ కార్య క్షేత్రం వేరన్నారు. ఎందు చేత? అన్నిటికీ అబలలు, అబలలు అని అనటం మొదలుపెడితే కొన్నాళ్లకు నిజం అనుకుని, అబలలయారు. ఇప్పుడు మేల్కొంటున్నారు. అధికారం చెలాయిద్దాం అని కాదు. తమ కర్తవ్యం సక్రమంగా నిర్వహించడానికే. ముఖ్యంగా భర్తలు పోయిన వారికి భర్తలు వదిలి పెట్టిన వారికి ఆస్తి హక్కు అవసరం అని ముగించారు.

పి. సరస్వతిగారు ఆస్తి హక్కు అవసరం లేదు అను వాదనను సమర్థిస్తూ యిల్లా చెప్పారు. మనం యే హక్కులు కావాలని కోరినా, యే మార్పులు కావాలని కోరినా, వుద్దేశ్యం మన జీవితాలు సుఖవంతంగా చేసుకోవాలనే కదా? ఏ ఏ విధంగా మనం సంతోషంగా కాలం గడపటానికి వీలుంటుంది అని చూద్దాం. ఆస్తిలో హక్కు కనక వుంటే, స్వతంత్రంగా బ్రతక వచ్చు ఒకళ్ల మీద ఆధారపడి వుండక్కర లేదు అనుకుంటాము. స్వతంత్రంగా జీవించే జీవి ప్రపంచంలో యేదీ లేదు. ఒక విధంగా కాకపోతే యింకో విధంగా యింకొక ప్రాణిమీద ఆధారపడివుంటాము. సంసారంలో స్త్రీకి వున్న హక్కు (ఆస్తిలో కాదు, అధికారంలో) పురుషుడికి లేనే లేదు. తేనె టీగల గూట్లో రాణీలాగ గృహ సామ్రాజ్యాన్ని సరి దిద్దటం ఆమె పని. మగవారికి సంపాయించటం బాగా తెలుసుగాని, దానిని తన సుఖానికి యెల్లా వినియోగించాలో తెలియదు. యిల్లు దిద్ది అందుకు సంబంధించిన వారి జీవితాలు క్రమ పద్ధతిలో వుంచగలిగినది స్త్రీయే. ఆమెకున్న సమర్థత పురుషుడికి వుండదు. తన కున్న శక్తి భర్తకు, పిల్లలకు ఆనందం యివ్వటంలోను, సుఖం యివ్వటంలోను వినియోగించి, అందులో తను ఆనందం పొందాలి. ఆనందం యెప్పుడూ ఒకరిని ఆనందింప చెయ్యటంలో యెక్కువ పొందగలం. ఈ శక్తి ఆస్తి వున్నంత మాత్రాన వస్తుందంటారా? రాదు. మానసిక సంస్కారంవల్ల వస్తుంది. తన స్థానంలో తను వుండి, అందరిని తన ఆదరణ, అభిమానాల వల్ల తనకు క్షేమ పాత్రులుగా చేసుకోవాలని ప్రయత్నించాలి. ఆస్తి తెచ్చుకున్నంత మాత్రాన్న నిజమైన సంతోషం రాదు. ఇతర దేశపు స్త్రీలను అనుకరించి మన అలవాట్లు, పద్ధతులు మర్చిపోయి అనవసరపు బాధ తెచ్చి పెట్టుకోరాదు.

భర్తలు వదిలి పెడితేను, చచ్చి పోతేను ఆస్తి తప్పకుండా వుండాలన్నారు. వుంటే పరవాలేదు కాని, లేకపోతే మరేం బాధ లేదు. ఆమెలో వున్న సాహసం, ఓర్పు, మాతృత్వం యివన్నీ నిజమైన రూపం ధరిస్తాయి. స్వార్థం పూర్తిగా పోతుంది. ఇంకొకరి యింట్లోయుండి వాళ్ల సంసారంలో, వారి పిల్లలతో సంతోషం తెచ్చుకోటానికి ప్రయత్నం అందులో వుండే కష్టాలను యెదుర్కోటంవల్ల చివరికి పరిపక్వమైన సంస్కారం వస్తుంది. ఇప్పుడు చదువు వల్ల, అహం ఒకటి యెక్కువయి, యిల్లు వదిలిపెట్టి బైటకు వెళ్లిపోయి, యేదో సుఖపడతాం అనుకుని వెళ్లి, నానా బాధలు పడతాం. దేశ సేవ చేస్తాం అనుకోటం. ఆ సేవ రక్త సంబంధంవున్న మన వాళ్లకే చేయకూడదూ! కనక ఆస్తిలో హక్కు అంత అవసరం కాదని నా అభిప్రాయం.

పిమ్మట సభ్యుల అభిప్రాయమునకు ఓటు తీసుకోగా మెజారిటీ "స్త్రీలకు ఆస్తిలో పురుషులతో సమాన హక్కు కావాలని" ఓటు యిచ్చారు.

తరవాత అధ్యక్షురాలయిన శ్రీమతి మామిడిపూడి వెంకమ్మగారు రెండు ప్రక్కల వారూకూడా బాగానే సమర్థించారు, ఆస్తి అక్కర లేదన్న వారు బాగా ధాటీగా చెప్పారు గాని మన దేశ పరిస్థితులు, సాంఘిక పరిస్థితులు, సంఘంలో వున్న వ్యక్తులుపడే అవస్థలు చూస్తే తప్పక యీ హక్కు కావాలనే నా ఉద్దేశ్యం అన్నారు.

అధ్యక్షురాలికి, సభాసదులకు కృతజ్ఞతాభి వందనములతో ఆ రోజు సభ ముగించటమైనది.

—పి. సరస్వతి
కార్యదర్శిని



బలిదానం

★

....ఆమె జీవనజ్యోతి అమ్మవారి
విగ్రహంలో లీనమైపోయిం
దంటారు ఆ వూరి
ప్రజలు.

★

: కథానిక :
శ్రీమతి దాసరి కమలాదేవి

: చిత్రం :
శ్రీమతి వి. సరోజిని

పొలంలో తాత తన ఎద్దును మేపుకుంటున్నాడు. ఇంటిలో సహాయ మెవ్వరూలేరు. భుజంమీది కొంగు క్రింద పరచి మేను వాల్చాడు. పడుకొని కండ్ల నీరు కార్చాడు. పాపం వృద్ధునికి మనస్సులో ఏమి బాధో? ఇంతలో నలు దెసల సంజ కెంజాయలు అలముకొన్నాయి. తన ఎద్దును తోలుకొని సమీపాన్నున్న చిన్న గ్రామానికి బయలు దేరేడు.

అది పర్వత ప్రాంతపు పల్లె కాబట్టి మంచి ఇల్లు ఒక్కటీ లేదు. అన్నీ చుట్టిండ్లే. ఆ ఇండ్లలో వృద్ధుని దొకటి. ముదుసలి ఉస్సురుస్సురనుకొంటూవచ్చి ఎద్దును కట్టు కొయ్యకు కట్టి అలసటతో "గౌరీ! గౌరీ! తలుపు తీయమ్మా" అని పిలచేడు. దొడ్లో పొయ్యి రాజేయ పోతున్న గౌరి, తాత గొంతు విని నిప్పు అక్కడే వదిలి పెట్టి పరుగు పరుగున వచ్చి తాతకు తలుపు తీసింది. తాత త్వరగా లోపలికి వచ్చి నుక్కినులక మంచముమీద కూలబడ్డాడు. ఇంతలో గౌరి పొయ్యి రాజేసి తాత కొరకు నీరు కాగబెట్టి వచ్చి "తాతా నీళ్లు తోడినాను, స్నానానికిరా!" అని అన్నది.

అని గౌరి తాతను స్నానము చేయించి అన్నము పెట్టింది. తాత మనమరాలి చేతి బువ్వను ఆనందముతో ఆరగించి ఆ రాత్రి నిదురపోయాడు. ఈ తాతకు లేకలేక ఒక్క కూతురు పుట్టింది. ఆమె పెద్దదైన తరువాత పెండ్లి చేసేడు. కూతురి పెండ్లప్పటికే అతని భార్య చనిపోయింది. కూతురువద్ద నే

ఈ తాత తన కాలము గడిపి దాని చేతిమీదుగా దాటి పోదలచేడు. కాని తానొకటి తలచిన దైవమొకటి తలచె నన్నట్లు తన కూతురు ఈ గౌరిని భూమి మీదపడలి తన దారిని తాను పోయింది. కాలుడు ఆమెను మ్రింగి వేసేడు. అనాటి నుండి తాత మనుమరాలిని పెంచి పెద్దదానిని చేసాడు.

ప్రక్కనున్న పట్టణంనుండి ఒక ధనికుడు ఆ గ్రామానికి వచ్చి చేరేడు. అతని పేరు ఆనందరావు. పాతిక సంవత్సరా లుంటాయి. పట్టి త్రాగుబోతు.

తాతకు ఒక దినము దగ్గు, పడిసెము పట్టింది. అందువలన గౌరి ఎద్దుకు గడ్డి కోసుకు రావటానికి వెళ్ళింది. చెఱువు గట్టున గడ్డి కోస్తుండగా ఆనందరావు ఆమెను చూచి తాను వివాహమాడాలను కున్నాడు. మరుచటి దినం తాతవద్దకు పోయి గౌరిని తన కిమ్మని అడిగేడు. కాని గౌరిని ఇచ్చుటకు తాత ఒప్పుకోలేదు. ధన ముంటే నేమి? నీవు గుణహీను డవు. నా గౌరి సుగుణవతి. ఆమె సుఖమే ప్రధానము గాని నాకు డబ్బుతో పనిలేదు. నీకు నా గౌరినియ్యనన్నాడు.

కొంత కాలం గడిచింది. ఆ సంవత్సరము ఆ చుట్టుపట్ల ఎచ్చటా ఒక్క చినుకైనా పడలేదు. తాతకు ఆరోగ్యము అంత బాగుండుటలేదు. వర్షాలు లేక పోవటంవల్ల ఎద్దుకు గడ్డి లేదు. వెళ్ళి కోసుకురావటానికి తాతకు శక్తి లేదు. పోనీ గౌరిని ఒక్కదానిని పంపుదామంటే దుర్మార్గుడు ఆనంద రావు గౌరిపై కన్ను వేశాడు. అందువల్ల ప్రతి దినము అన్నము తిన్న తరువాత గౌరి గడ్డికి పోతుంటే గౌరితో ఆమెకు తోడుగా తాతకూడ కఱ్ఱ పట్టుకొని పోయేవాడు.

ఈ సమయంలో ఆ ఊరి అమాయక ప్రజలందరు ఆనంద రావును పెద్దగా చేసి అతని వద్దకు పోయి క్షామనివార ణార్థం ఏమి చేయవలెనని అడిగేరు. ఆనందరావు వారితో "గంగానమ్మకు కోపము వచ్చినది. ఆమె కోపమును పోగొ ట్టుటకొరకు జాతర చేసి బలి ఇయ్యవలె"నని సలహా ఇచ్చేడు. వారు "ఏ బలి?" అని అడిగేరు. "మంచి బలముగల చక్కని వృషభమును బలి ఇయ్యవలె"నని చెప్పేడు. మంచి వృషభము ఎవరివద్దను లేదు, తాతవద్ద తప్ప. తాతను ఎద్దు నమ్ముమని అడగమని ఆనందరావు వాళ్ళతో చెప్పేడు. ఊరిలో కొందరు పోయి తాతను ఎద్దు నమ్ముమని అడిగేరు. తాతకి జీవితంలో రెండే మిగిలాయి- తన గౌరీని, తన ఎద్దూను. ఎద్దును బలికి తోలేస్తే తన గౌరినీ తన సర్వస్వమునూ పోగొట్టుకున్నట్టే అనుకున్నాడు. అమ్మ వారికి అంతగా బలి కావలసి వస్తే నన్నే చంపెయ్యండి, ఎద్దు రక్తంకన్నా మానవ రక్తం రుచికరంగా వుంటుంది అన్నాడు.

ఆనందరావు ఒకనాటి సాయంకాలము తాత ఊరిలో గడ్డి కోయటానికి పోయినప్పుడు ఎద్దును తోలవేసుకొచ్చి పసుపురాసి కుంకుమంచి మాలలతో నలంకరించి బలికి తయారు చేసేరు. పాపము నోరు లేని జంతువు ఏమి చేయ గలదు. తన్ను అత్యంత ప్రేమతో చూచెడి తాత కొరకు అటునిటు చూచుచు అరవ నారంభించింది. ఆ దీనాలాపం తాతకి వినిపించింది. తాత నెత్తీ నోరూ కొట్టుకొంటూ గంగమ్మ గుడి వద్దకు పరుగెత్తుకు వచ్చాడు. ఎద్దును గంగమ్మ ముందు నిలబెట్టి ప్రదక్షిణాలు చేసి కత్తిని నూరి చూచి ఎత్తేరు. దానిని చూచి తాత పరుగుపరుగున వచ్చి అడ్డుటు చేరేడు. ఎత్తిన కత్తి క్రింద పడింది. రక్తము వరదలై ప్రవహించింది. ఎద్దు వెఱ్ఱి చెదరలేదు. కాని, క్రింద తాత రెండు తునకలై పడ్డాడు. వెంటనే పెద్ద వర్షము వచ్చింది. ఆ వర్షధారలలో ఎద్దు కంటి ధారలు లీనమై పోయాయి. ఎద్దు మాత్రం తాత మొండెంవద్దే నిలబడి పోయింది. బెదిరించినా, కొట్టినా కదల లేదు. తాత పెంచిన ఎద్దు, మూర్ఖ ప్రజ కడుపున పెట్టుకొన్న ఎద్దు, శిలయై నేటికీ ఆ గ్రామంలో నందీశ్వరునిలా వెలిసివున్నాడు. తాతా, ఎద్దూ ప్రపంచంలో లేరు. గౌరికూడా అదృశ్యమై పోయింది. ఆమె జీవన జ్యోతి అమ్మవారి విగ్రహంలో లీనమైపోయిందంటారు ఆ వూరి ప్రజలు.

—అందుకే ఆ గ్రామంలో ఆ నాటినుంచీ గ్రామ దేవతకు బలి మానుకున్నారు.

★

అత్తగారు

శ్రీమతి తిమ్మాదాయమ్మగారు

'అత్తగారు' అనేటప్పటికి చటుక్కున వక్కాబాయి అత్తగారి సంగతి జ్ఞాపకం వస్తుంది, ఎప్పుడూ సాధిస్తూ, కొండాలు చెప్తూ, నేరాలు మోపుతూ, కోడలి జీవితం దుర్భరం చేస్తూ వుండే మనిషీ అని. 'అత్తగారు' అనే మాట యేం పాపం చేసుకుందో కాని—యదార్థ జీవితం అటుంచి కనీసం కథలలోనైనా ఆ మాటకి గౌరవ స్థానం లేక పోయింది. కాల ప్రభావంవల్ల పరిస్థితులలో మార్పు వచ్చినా, కోడళ్లే అధికారాన్ని హస్తగతం చేసుకున్నప్పటికీ, అత్తగారంటే 'అమ్మోయ్' అని స్ఫురించే సాంప్రదాయం నిలబడి పోయింది. పెళ్లిలో అప్పగింతల వేళ తల్లి మనసులో విషాదం ఒక్కసారిగా చెలరేగుతుంది. ఆ ఘట్టం వచ్చేసరికి ఆమె కళ్లలో నీళ్లు గిర్రున తిరుగుతాయ్ ఆపుకుందామని యెంత ప్రయత్నించినా. ఆ తల్లి హృదయం తరచి తరచి చూస్తే—అమె భయపడేది, అల్లుడికి కాదనీ, ఎదురుగుండా కూర్చున్న వియ్యపురాలికేననీ తేలుతుంది. కోరి తెచ్చుకున్న వాడు అల్లుడు. మరి అత్తగారో ? అధికారం చెలాయిస్తుంది, సాధిస్తుంది, వేధించుకుతింటుంది. అత్తగారు తానుకూడా ఒకప్పుడు కోడల్నే అన్న సంగతి బొత్తిగా మర్చి పోతుందిట. అందుచేతనే అధికారం చెలాయించి కోడంటికముపెట్టాలన్న దురాగ్రహం ఆమెను వదలదు. ఇంటికి వ్యాయువార బ్రాహ్మడు వస్తే 'యీ రేమను రోజుల్లో బియ్యం ఎక్కువున్నాయి మ్యా, వెళ్లు' అందిట కోడలు. అప్పుడు అత్తగారు రంయిమని లేచి 'వుందన్నా లేదన్నా నేననాలి కాని నువ్వెవరు' అని దెబ్బలాడిందిట. ఎంత దురహంకారమో చూడండి అత్తగారికి. పరాయి యింటినుంచి వచ్చిన తనకు యింటి అధికారం ఎల్లా దఖలు పడిందో అల్లాగే కోడలికీ అని ఆ అత్తగారు ఆలోచించలేదన్నమాట. ఈ సందర్భంలోనే ఒక చిన్న కథ చెప్తాను. ఒక అత్తగారు తలంటుకుంటూ ఆమె కోడల్ని వీపు రుద్దమ్మా అని అడిగిందట. ఆ కోడలు నిశ్చలమైన మనస్సుతో అల్లాగే, అంతకన్నానా అందిట. కాని ఎంత ప్రయత్నించినా చేతులు రాలేదట. ఇదంతా కనిపెట్టి చూచిన అత్తగారు "ఇందులో నీ తప్పేం లేదు. నా అత్తగారు వీపు రుద్దమన్నప్పుడు చిల్లపెంకుతో రుద్దేదాన్ని, దానికి ప్రతిఫలంగా భగవంతుడు నీ చేతుల్ని లేవనీయటం లేదు" అందిట. అత్తగారు తను కోడలుగా

అధికారం చెలాయించకుండా వుంటుందా?

వున్నప్పుడు అత్తగారి పట్ల చూపే గౌరవాదరణాలు జ్ఞాపకం చేసుకుంటే అత్తల ప్రవర్తన వేరు విధంగా వుంటుంది.

దేశ కాల పరిస్థితులు మారినప్పుడల్లా, మనుష్యుల తత్వాలూ, ఆచరణలూ మారుతవనీ వాటి కనుగుణ్యంగా తన అభిప్రాయాలు కూడా మార్చుకోవాలనీ అత్తగారు కనక అనుకుని ప్రవర్తించినట్లైతే అత్తా కోడళ్ల యిద్దరి జీవితాలూ సుఖంగా సామరస్యంతో జరిగిపోతాయి. అత్తగారు కోడలుగా వున్న కాలంలో గోచీ పోసి చీర కట్టుకోడంతప్పు. ఆ కట్టుకి ఎప్పుడైనా ముచ్చట పడితే "సంసారి వేటే నువ్వు" అనేదిట ఆమె అత్తగారు. అల్లాగే యిప్పుడు గోచీ పోయుని కట్టుకు ప్రస్తుతపు అత్తగార్లు సహించి వూరుకుంటే యేమీ గొడవ వుండదు.

అసలు, అధికారం చెలాయిద్దామన్న దురహంకారం వున్న అత్తగార్లు వట్టి తెలివితక్కువ వాళ్లన్నమాట. అధికారం అంటే యేమిటి? బాధ్యతన్న మాట. అధికారం వదలి పెట్టడమంటే యింకొకరి మీద బాధ్యత పెట్టడమన్నమాట—అత్తగార్లు యీ కిటుకు గ్రహిస్తే ఎంత సుఖంగా కాలం గడపవచ్చు! అమ్మా, అంతా నీదే, నువ్వే చూసుకో, వేళకు కాస్త పెడ్తే చాలు కృష్ణారామా అనుకుంటూ కూచుంటాను అనే అత్తగారిని కోడలు పువ్వుల్లో పెట్టి పూజిస్తుంది. కాపరానికి వచ్చిన కొత్తలోనే బాధ్యత మోసి పుట్టింటికైనా వెళ్లనంటుంది. ఈ కిటుకు గ్రహించిన గడసరి అత్తగార్లు యిటివరకు అంతగా లేరేమోగాని యిప్పుడు ఎక్కువగానే వున్నారు.

మా అమ్మమ్మ పాడే పాత పాటలో సీతను కౌసల్యాదేవి యెట్లు చూసేదో వర్ణించారు. తలంటి, గోరింటాకు పెట్టి, కోడలు యెక్కడ కందిపోతుందో అని అల్లారు ముద్దుగా చూసేదట. అట్లాంటి అత్తగారికి సీతవంటి కోడలు దొరకడం అపురూపం కాదు.

అధికారం చలాయించని అత్తగారూ, పెద్ద దిక్కుగా అత్తని ప్రేమతో చూసే కోడలూ.— యీ యిద్దరూ అపురూపం అనే సామెత యింకా మన సంఘంలో వుండడానికి కారణం స్త్రీలలో చదువు సంధ్యలు లేకపోవడం, మగవారిలో అసమర్థతయునూ. అత్తను తల్లిలాగ పరిగణించే కోడళ్ని చూచినప్పుడల్లా యీ అత్త ఎంత గడసరి అని అనిపిస్తుంది నాకు. కోడళ్ని కూతురు కన్నా ఎక్కువగా ఆదరించే అత్తగార్ని చూసినప్పుడల్లా ఎంత చాకచక్యం వుంది యీ కోడలికి అనుకుంటూవుంటాను.

—మద్రాసు రేడియోకు కృతజ్ఞతతో.

సింహాచల యాత్ర

✽ శ్రీమతి యస్. కామేశ్వరిగారు ✽

"పోయి సేవింపలేకున్నఁ బుణ్యతీర్థ
మహిమ వినుటయు నఖిల కల్మషహరంబు."
(మనుచరిత్ర)

విశాఖపట్నం మహిళా సంఘంవారందరం అనుకున్నాం ఒక రోజున సింహాచలయాత్ర గావించి వద్దామని—పిక్‌నిక్ అనుకోండి, యాత్ర అనుకోండి—యేమైతేనేం, మెంబర్లంతా అంగీకరించేరు. ఎవరికితోచిన ఫలహారాలు వారు పట్టుకువస్తే, జట్కాలు కట్టించుకుని 'జయ్, పరమేశ్వరా' యని బయలుదేరేం. గంటున్నర ప్రయాణంతో సింహాచలం చేరుకున్నాం. కొండ క్రింద పూలతోట, పోకతోట చూచి, కొండ యెక్కడం ప్రారంభించేం. 'జై హింద్', 'బోలో స్వతంత్ర భారత్‌కీ', 'హిందూ ముస్లిమ్ ఏక్ హై' లాంటి నినాదాలు చేసుకుంటూ పర్వతారోహణపూర్తి చేసేం. (పట్టి నినాదాల్లోగాక గట్టి కార్యక్రమంలో ఉత్సాహం చూపించాలని మాకు తెలుసు గాని, ఇలా జయజయ ధ్వనులతో శ్రమగమనించకుండా కొండ యెక్కడానికి దాంతో వీలయ్యింది).

కొండమీద శివాలయం ఒక ప్రక్కను, నరసింహాలయం ఒక ప్రక్కను అన్నదమ్ములవాటాలా అన్నట్టు అతి రమ్యంగా కట్టబడి ఉన్నాయి. చలువరాతిలోనున్న భారతి, శంకరాచార్య విగ్రహాలుగాంచి, శిలలకు జీవంపోసిన మన శిల్పుల చాతుర్యానికి అంజలి ఘటించేం. శివపూజానంతరం విష్ణుదర్శనం చేద్దామనుకుంటే అంతట్లో మధ్యాహ్నం ఒంటిగంటన్నరైందని తలుపులు మూసేసేరు. ఈలోపున పొట్టపూజ! చేద్దామని తెచ్చిన ఫలహారం పొట్లాలువిప్పి సుష్టుగా సర్దుకు సర్దుకు తిన్నాం. తిన్నదరగడానికి, ఇంకా ఆలయం తీయడానికి పట్టే గడువుకాలం గడపడానికి, అంతా వంతులవొప్పున పాటలుపాడేం. నారికేళాలు, కదళీ ఫలాలు కరాల్లో గ్రహించి, అప్పుడాలయానికి వెళ్లేం. ప్రదక్షిణాల అనంతరం గర్భగుడి చేరుకున్నాం. గర్భగుడి ముందర ఒక గది, ఆ గదిమధ్య నొక తెర, (ఈ తెర తీసేయుంది) ఆ గది ముందు 3 అడుగుల యెత్తున ఒక కటకటాల గదీ ఉన్నాయి. గుమ్మందగ్గర మేమంతా నిలుచున్నాం. శ్రీ నరసింహస్వామి విగ్రహం దృగ్గోచరమౌతూ వుంది. అంతా కరాలుమోడ్చి, శిరాలువంచి వందనాలర్పించేం. 'దేవుడు వరమిచ్చినా పూజారి వరమివ్వడ'న్న నుడి సార్థక్యమైనట్టు, టిక్కట్టుంటేగాని లోనికి వెళ్లడానికి వీల్లేదన్నాడు ద్వారంలో నిలుచున్న పూజారి. 'పండ్ల చెట్లకువేసిన ముండ్ల కంపల్లాగ' యీ యేర్పాట్లెందుకు గావించేరో పెద్దలు అనుకున్నాం. రెండేసి అణాలిచ్చి ఇంతమంది టిక్కెట్లెక్కడ కొనుక్కోగలమని, పోనీ నైవేద్యం సమర్పించి తెచ్చియివ్వండి అంటే టిక్కెట్టులేందేం అదీ వీలులేదన్నారు. పోనీ సాయంత్రం వీలౌతుందా అంటే కాదన్నారు స్వాములవారు. టిక్కెట్ల సొమ్ము ఎవరికి చెందుతుందంటే సంస్థానం వారికన్నారు. అందరికీనా యీ టిక్కెట్టు పెట్టం అంటే ఆఫీసర్లకు లేదన్నారు. మా కళ్లముందే, ఒక ఆఫీసువర్గం వారంతా, 'వనసంతర్పణ' కోసరంవచ్చి, టిక్కెట్లు లేకుండానే స్వామిదర్శనంచేసి వెళ్లేరు! దేవాలయాల్లోకూడా స్త్రీలకే అర్థచూపులేమిటాయనుకున్నాం. ఒకవేళ స్త్రీల వల్ల ఏమైనా మైల తగులుతుందేమో ననుకున్నా, అలాంటి వారు అసలు ఆలయానికే రారుగా. ఈ అన్యాయం 'ఆంధ్ర మహిళ'లో ప్రకటిద్దామనుకొని, ధ్వజస్తంభం దగ్గరనే కొబ్బరికాయలు కొట్టి, సర్వాంతర్యామియైన భగవంతుడిక్కడ మాత్రం నైవేద్యం స్వీకరించడాయనుకున్నాం. అక్కడున్న దరిద్రనారాయణుల కవి పంచియిచ్చి, దీన

సింహాద్రి అప్పన్న దర్శనానికిగూడా పెర్మిట్ కావాలి!

మానవారాధనే దైవారాధన అని ఆనందించేం. ఇక తిరుగు ముఖం పడుతుంటే, ఇంకా కల్యాణమంటపం చూడాలన్నారు. అక్కడ శిల్పం శ్రీకృష్ణదేవరాయని కాలంలో నిది. అక్కడ 108 రకాల స్తంభాల నిర్మాణంలో శిల్పులు చూపిన సామర్థ్యానికి చేతులు మొగిడ్చేం. తదనంతరం స్తావాలరేవు సందర్శించి, పర్వత అవరోహణగావించి, జట్కాలెక్కి యిళ్లకు జేరేం.

“విష్ణువుకు బూడిదపూస్తే శివుడు, శివుడి కరంలో కపాలం తీసేస్తే విష్ణువు” అన్నారొకరు.

“శివుని సేవింప గోరువారు ముందాతని బిడ్డల సేవింప వలయు” నన్న పాఠము నేర్పడానికై యీ ప్రయాణము కల్పింపబడి యుండవచ్చునని మేమప్పుడనుకున్నాం! ఎవడు జీవారాధకుడో వాడే శివారాధకుడని పెద్దలూ, గాంధీ చెప్పిన పల్కులు మాకు జ్ఞప్తికి వచ్చేయి.

అంతర్జాతీయ భావన

★

["సోదరీమణులకు మనవి" చిన్న పుస్తకములోని తుది అధ్యాయము.
ముందు అధ్యాయములు ఆంధ్ర మహిళలో వరుసగా ప్రకటింపబడినవి.]

★

మాతృదేశ స్వాతంత్ర్యమునకు పోరాటము సలిపే సమయములో మన దృష్టి అంతా స్వదేశ స్వజాతికి సంబంధించిన విషయాలలో మగ్నమై వుండటము సహజము. కాని బాహ్య ప్రపంచ పరిస్థితులను గమనించకుండ తప్పదు. మన వ్యక్తిగత ఇష్టాయిష్టములతో ప్రసక్తి లేకుండానే విజ్ఞాన శాస్త్ర పరిశోధనల ఫలితముగ నేడు ప్రపంచములో అన్ని దేశములకు పరస్పర పరిచయము ఎక్కువయింది. ఒక దేశము చేసిన పనికిగాను ఎక్కడో దూరమున వున్న యితర దేశములు యే యే అనుభవములు పొందినవి గత రెండు ప్రపంచ సంగ్రామములవల్ల మనకందరకు విదితమే. వివిధ జాతులుగ విభజింపబడి నప్పటికి అంతా మానవ జాతేనన్న సంగతి గుర్తిస్తే పరస్పర సహృద్భావముగల శాంతి రాజ్యమును స్థాపించ కలుగుతాము. స్థూల లాభము కన్న, తోటి మానవుల సద్భావన విశాల హృదయములు అమూల్యమైనవని గమనించితే యీ వర్ణవైషమ్యములు, అధికారలాలసలు క్షణములో నశించిపోగలవు. నాగరికత పేరిటో, మతము పేరిటో మరి యే యితర విషయము పేరిటో ఒక మనిషి తన తోటి మనిషిని నిలువున చంపి ఆనందించ గలుగుతున్నాడంటే యీ మానవుల పరస్పర పరిచయములోనే మొదటనే యేదో ఒక పొరపాటు వుండివుండాలి. రెండు తప్పులు ఎప్పటికి ఒక ఒప్పు కాలేవు. ద్వేష జనితము ద్వేషమే పశు శక్తిని వుపయోగించి సఫలులు ఎప్పటికి కాలేరు. ఎందు చేతనంటే యీ పశుబలాన్ని మించిన పశుబలము యింకొకరికి వుండవచ్చు. అందుచేత పశుబలమును మించిన శక్తి గలది పరస్పర సహృద్భావ మనే సూత్రమును స్త్రీలందరు తమతమ దేశములకు చక్కగా ఎరుక పరచాలి. మేము చేసినదే ఒప్పు అనే అహంకారము, గర్వము కుత్సితము, మనసులో పెట్టుకుని జయించిన పక్షములు చేసే శాంతి ఒడంబడికలలో ప్రతి క్రియే దాగి వుంటుంది. కొత్త ప్రాణులను సృష్టించేది స్త్రీలు కావడమువల్ల ప్రాణరక్షణ వారి సహజగుణము. ప్రస్తుతము నలువైపుల ఆవరించి వున్న సంకుచిత జాతీయ భావము (Narrow nationalism) నశించి విశాల ఆవరణమును ఏర్పరుచుకుంటే స్త్రీలు తప్పక తమ ఉన్నత ఆదర్శమును ఆచరణలో పెట్ట సమర్థలు కాగలుగుతారు. కమ్యూనిజము ఏ విధముగా యావత్ప్రపంచములోనుండు కార్మికులను ఏకము గమ్మని ఆదేశిస్తుందో ఆ విధముగ సుఖ పూర్ణ జీవితమును కొనసాగించుటకు ప్రపంచములోని స్త్రీలము అందరము ఏకమై సర్వశక్తులను వినియోగించాలి. ప్రేమ

రచన:
రాజకుమారి అమృతకౌర్

★

తర్జుమా:
శ్రీమతి అచ్యుతుని గిరిజ

అన్నిటిని జయించగలదు. ఏ విధమైన క్రౌర్య, హింసలతోను మాకు ఎంత మాత్రము సంబంధము లేదని సహాయ నిరాకరణ చేయగల నిగ్రహ శక్తిని సాధిస్తే మనలో సహజముగా యిమిడి వున్న ప్రేమామృతమును లోకముపై వర్షింప గలుగుతాము.

తుది పలుకు

తోటి సమాజ సేవికలకు తెలియని యే ఒక్క కొత్త విషయమును గాని నేను చెప్ప లేదు. కాని అధిక సంఖ్యాకలుగా స్త్రీలందరు యీ సమాజ సేవకు పూనుకొన వలసిన తరుణము వచ్చినది. ఆ వచ్చేవారిలో కొంతమంది యింతకు పూర్వము యీ కార్యక్రమమునకు పూనుకొని యే కారణము చేతనైన విఫలులై వుండవచ్చు. మరి కొంత మంది ప్రారంభించటానికి సరియైన విధానము తెలియని ఆరంభ దశలో వుండవచ్చు. కాబట్టి అటువంటి వారికందరికి నేను చెప్పినది ఏమైన ఉపయోగించగలదేమోనని నా అభిప్రాయము. ఇంతే కాక నా యీ విజ్ఞప్తి అనేక యువహృదయాలలో సేవానురక్తిని కలిగించి సఫలము గాగలందులకు కూడ ఆశిస్తాను. సర్వ విధాల క్రుంగ దీసి చేతనా రహితులను చేసిన యీ పరిపాలనా శృంఖలాలలో మన మే కార్యక్రమమైనా సక్రమముగ నిర్వహించలేము. ముందు స్వాతంత్ర్యము సిద్ధించాలి. అంధకార బంధురమైన రాత్రి తేజోవంతమైన సుప్రభాతము అయి తీరునల్లే మనము సంసిద్ధులముగా వుండటమునకే మనము యింకా యింకా కార్యరంగములో ప్రవేశించి సేవ చేయాలని నా విజ్ఞాపన. మున్ముందు పొందవలసిన లాభములు అన్నీ పొందాలంటే ఇప్పటికిప్పుడు యీ క్షణమునుంచి ప్రజాసేవకు ఉపక్రమించాలి. గతమునుంచి అనేక అనుభవములను గడించాము. మున్ముందు సిద్ధించ వలసిన కోరికలు ఎన్నో వున్నవి. కాని యాదాలాపనగా ప్రస్తుత సువర్ణ ఘడియలను వృథా పుచ్చితే మరి యే ఆశలు ఫలించ లేవు. స్వాతంత్ర్యము సిద్ధించి జాతీయ ప్రభుత్వము వచ్చిన శుభ సమయమున దేశములోని చెనుగు, అనర్థమును సమూలముగా పెరికి వేసి, ప్రజా బాహుళ్యానికి బహుళముగా లాభించగల విధానములను ప్రవేశపెట్టుటకు, ప్రభుత్వాజ్ఞను శిరసావహించి నెరవేర్చగల సేవాధురంధరులు కావలసి వస్తుంది. అటువంటి పరిస్థితులలో స్త్రీలమైన మనము మనకు అనర్థదాయకములుగా, నష్ట కారకములుగా వున్న దురాచారములను మొదలంట పెరికి వేయ గలిగి వుంటానికి బదులు మీనమేషములు లెక్క పెడుతు కాలయాపన చేస్తున్నామనే వాదు పడరాదు. స్త్రీ జాతికి వారసత్వముగా వస్తున్న యశస్సును, ఔచిత్యాన్ని మనము సురక్షితముగా కాపాడాలి. తగిన వారసులమనిపించు కోవాలి.

'మేనర్ విల్లా'

సిమ్లా. 1943 లో వ్రాయబడి

1945 లో సరిచూడబడినది. *

---

* ఇంతటితో రాజకుమారి అమృతకౌర్ వ్రాసిన 'సోదరీమణులకు మనవి' అనే చిన్న గ్రంథము ముగిసినది. ఇందులో వుండే యే భావ, ఆశయాలకుగాని రచయితే బాధ్యురాలు, అనువాద కర్త్రిని అయిన నేను కాదు—అ. గిరిజ

★ మైకేలు ★

మూలం :
విలియంవర్డ్స్‌వర్తు

అనుసరణ :
కొండేపూడి శ్రీనివాసరావు

ఆ లోయ సమీప భాగంలో ఒక గొల్ల నివసించేవాడు. "మైకేలు" అతని పేరు. వయస్సు మళ్లినా, సన్నగిల్లని శరీరధారుఢ్యం, కండలు తేరిన శరీరం, విశాల వక్షస్థలం, తేజోవంతమైన విశాల నేత్రాలు మైకేలు ఎనభై సంవత్సరాల వృద్ధు అంటే చూచిన వారెవ్వరూ విశ్వసించరు. వృత్తి విద్యలలో మైకేలుది అందెవేసిన చేయి.

మైకేలు జీవితం ఏకాంతంగా గడుపలేదు. ఇతనికి ఇసబెల్లా అనే ఇల్లాలుంది. ఇసబెల్లా మైకేలు కన్న వయస్సులో 20 సవత్సరాలు చిన్న. ఆమె కష్ట జీవి. గృహ కృత్యాల్లో బహు నేర్పరి. సోమరి తనంతో, నిద్రపుచ్చుతూ కాలం వృధాపర్చడ మంటే ఆమె కెక్కడలేని రోత. ఇసబెల్లాకు రెండు రాట్నాలున్నాయి. ప్రత్తిరాట్నం విశ్రాంతిగా నున్నదంటే ఉన్నిది పనిలో నున్నదన్న మాటే!

ఈ వృద్ధ దంపతులకు లేక లేక ఒక కుమారుడు జన్మించాడు. అతడే వారికి వృద్ధాప్యంలో పుట్టిన ఏకైక బిడ్డ. తల్లిదండ్రులాతనికి ముద్దుగా "లూక్" అని నామకరణం చేసారు. అదే కాక మైకేలుకి కొన్ని వందల గొర్రెలు. అవి తప్పిపోతే జాడ తెల్సుకోనేందుకు రెండు విశ్వాసనీయమైన కుక్కలు ఉన్నాయి. ఇది మైకేలు సంసారం.

ఉదయాన్నే లూక్‌ను వెంట పెట్టుకొని, గొర్రెల్ని మేపుకోడానికి కొండలపైకిపోయి సాయంకాలానికి ఇంటికి చేరేవాడు మైకేలు......రోజులు గడిచిపోతున్నాయి. ఆ ముసలి దంపతులికి లూక్ ఇచ్చే ఆనందం, అతని భావిపై వారు పెట్టుకొనే ఆశలు, వాటిని గురించిన ఆలోచనలు, అవి తల్చుకొంటే కల్గే ఆనందోత్సాహాలు తప్ప, వారి జీవితంలో సంతోషమూ లేదు—విచారమూ లేదు.

లూక్‌కి పదునెనిమిది సంవత్సరాలు నిండాయి. తండ్రితో సమంగా అన్ని పనులూ చేసే స్థాయికి వచ్చాడు. మామూలుగానే తండ్రీ తనయుడు ఉదయాన్నే గొర్రెల్ని మేపడానికి పోవడం, రాత్రికి గూడు చేరుకోవడం, పగలు, రాత్రి విశ్రాంతి విరామాలెరుగకుండా వేసవిలో తుమ్మెద లాగ శబ్దం చేస్తూ ఇసబెల్లా తన రాట్నాన్ని త్రిప్పుతూ పని చేసికోవడం పరిపాటై పోయాయి.

చీకటి పడినది మొదలు మైకేలు కుటీరంలో మిణుకు మిణుకు మంటూ మరల తెల్లవారేదాక దీపం వెలుగుతూండేది. చీకట్లో నక్షత్రంలాగ దారిని పోయే పాంథులకా దీపం మార్గం చూపించేది. అందువల్లే ఆ ఇరుగుపొరుగు వారంతా మైకేలు కుటీరాన్ని "సంధ్యతార" అని పిలిచేవారు.

లూక్ అంటే మైకేలుకి అఖండమైన ఆప్యాయం. అంతే కాదు లూక్‌ను తన ప్రాణంకంటె అధికంగా చూచుకొనే వాడు మైకేలు. ఏ నిముషంలో లూక్ తన దృష్టి పథాలలో లేకపోయినా మైకేలుకి మనస్థిమితముండేది కాదు.

లూక్‌కి 5 సంవత్సరాలు వచ్చేటప్పటికి వికసిత రోజా పుష్పంలాంటి బుగ్గలతో నవనవలాడుతూండేవాడు. 10 సంవత్సరాల ప్రాయుడయ్యేసరికి కొండ శిఖరాలపై నిలబడ గల్గడం ఎండవక, వానవక ఎంతదూరమయినా సునాయాసంగా నడవడం అలవాటైపోయాయి.

ఈ మాదిరిగా మైకేలు దృష్టిపథాలలో పెరిగి పదునెనిమిది సంవత్సరాల ప్రాయుడయ్యాడు లూక్. ఇంతలో వారి ఆనందమయ జీవితానికొక ప్రవాహ మొచ్చి అడ్డు తగిలింది.

కొన్ని సంవత్సరాల క్రితం మైకేలు తన పినతండ్రి కుమారునకు అప్పు కావలిసి వస్తే తాను జామీను నిలబడి తీర్చాడు. దురదృష్టవశాత్తు ఆ పినతండ్రి కుమారుడా అప్పును తీర్చలేక పోయాడు. ఆ పైకం వెంటనే చెల్లించమని, లేనిచో ఆస్తి జప్తు చేయవలసి వస్తుందని మైకేలుకి సమను జారీ చేయబడింది.

ఈ విపత్తును విదళించుకోవడ మేలాగ అని పరిపరివిధాల యోచించాడు మైకేలు. ప్రప్రథమంలో తన ఆస్తి సగమమ్మి అప్పు తీరుద్దామనే నిర్ణయానికి వచ్చాడు. మరల మరి రెండు రోజులు దీర్ఘంగా ఆలోచించాడు. మూడవ రోజు తన భార్యను పిలిచి ఈలా అన్నాడు—"ఇసబెల్లా! నలుబది సంవత్సరాలుగా ఈ సుతీక్ష్ణ సూర్య రశ్మిలో చెమటోర్చి రక్తమాంసాలోడ్డి, కష్టించి పని చేస్తూ మన మింత వరకు జీవిత యాత్ర సాగిస్తూ వచ్చాం. అనేక అప్పులతో దాపురించిన మన ఆస్తిని స్వేచ్ఛగా నిలబెట్టుకోగల్గాం. అదే కాక మరికొంత ఆస్తినికూడ సంపాదించుకోగల్గాం. ఈ పొలాల్లో ఎండనక వాననక సూర్యభగవానుని మాదిరిగా పని చేసినా ఫలితం దక్కలేదు. నే పడిన శ్రమంతా బూడిదలో పోసిన పన్నీరువలె వృథా అయింది. ఈ బంగారం పరుల కప్పగించానా, నా కుటుంబానికి నేనే నా చేతుల ద్వారా తీరని ద్రోహం చేసిన వాణ్ణవుతాను. నా కుటుంబమే నన్ను తెలివి హీనుడని నిందిస్తుంది. రెండహోరాత్రాలాలోచించి నే నీ క్రింది నిర్ణయానికి రాగల్గాను. ఇదే నాకు ఆశాజనకంగా కనబడుతోంది. లండన్ నగరంలో నాకు దూర బంధువయిన ధనిక వర్తకు డొకడున్నాడు. ఈ ఆపద సమయంలో అతడే మనకు ఆప్త బంధువు. మన లూక్‌ను అతని దగ్గరకు పంపివేద్దాం. లూక్ అతనిదగ్గర కొన్నాళ్లుండి వర్తక సరళినంతా నేర్చుకొని కొంత ధనం సేకరించుకొని అచిరకాలంలో మళ్లీ మన దగ్గరకు తిరిగి వస్తాడు. ఈలోగా మరింత అధికంగా కష్టించి పని చేస్తాను. మన భూములు మన క్రిందే ఉంటాయి. అయినా లూక్ ఇక్కడుండి అప్పునే విధంగా పరిష్కరించ గలడు? వాడుకూడ మన తోపాటు మరింత బీదరికంలోపడి ప్రాకులాడితే ప్రయోజన మేముంది పలుబాధలకు పాల్పడడం తప్ప? స్వేచ్ఛా వాయువుల్ని పీల్చే మన పొలాల్ని పరాధీనం కావడానికి వీలులేదు. వాటికి బానిసత్వాన్ని అంటకట్టడం నేను మహాపరాధంగా యెంచుతాను. ఎన్ని కష్టాలొచ్చినా సరే అవి స్వతంత్రంగా ఉండవలసిందే. లేక పోతే నాకు మనశ్శాంతి ఉండదు. సౌఖ్య ప్రదమైన చావు నా కుండదు. భూమ్యాకాశాలు తలక్రిందులయినా సరే మన భూముల్ని స్వేచ్ఛగా, స్వతంత్రంగా లూక్ పొందవలసిందే!" అని ఉద్రేకంతో తన ఉపన్యాసాన్ని ముగించాడు మైకేలు. ఇసబెల్లా మారు మాట్లాడలేదు. స్థిమితంగా కూర్చొని దీర్ఘంగా ఆలోచించ సాగింది. ఎన్నో ఆలోచనలు, ఎన్నో గాథలు ఆమె మనోవీధిలో తిరుగాడు తున్నాయి. ముఖ్యంగా కొద్ది సంవత్సరాల క్రితం వాళ్ల గ్రామంలో జరిగిన సంఘటన స్ఫురణ కొచ్చింది.

"పూర్వం ఆ గ్రామంలో రాబర్టు అనే అనాథ బాలకు డుండేవాడు. అతని దుస్థితి చూచి ఆ గ్రామస్థులంతా, తలొకరూపాయి చందా వేసికొని ఆ బాలకునికి కావలసిన బట్టలు మొదలయిన వన్నీ సమకూర్చి అతనిని లండన్ పంపారు. రాబర్టు లండన్‌లో ఒక వర్తకుని దగ్గర పనిలో ప్రవేశించి క్రమక్రమంగా వర్తక—రహస్యాలన్నీ నేర్చుకొని కొద్ది కొద్దిగా ధన మార్జిస్తూ కొంత కొంత కాలానికి తానే స్వయంగా వర్తకం సాగించి అనతి కాలంలో గొప్ప ధనవంతుడయ్యాడు. చలువరాతి సుందర భవనాలలో అతి మనోహరంగా జీవితయాత్ర సాగిస్తున్నాడు. తన స్వగ్రామంలో అత్యంత రమ్యమైన దేవాలయాన్ని పాలరాయితో కట్టించాడు. అంతే కాకుండా బీదసాదల కమితంగా దాన ధర్మాలు చేస్తూండేవాడు. ఈ మాదిరిగా సంపాదించిన దానిని సద్వినియోగం చేస్తూ శీఘ్రకాలంలో పెద్ద సంస్థానాధీశ్వరు డయ్యాడు" ఇటువంటి సంఘటన లెన్నో ఇసబెల్లా భావ ప్రపంచంలో తేలియాడాయి. ఇసబెల్లా ముఖం సంతోషంతో విప్పారింది. ముసలి మైకేలుకి ప్రాణం లేచివచ్చింది "అమ్మయ్య" అని ఒక నిట్టూర్పు విడిచి "ఇసబెల్లా! తిరిగి మనలో యౌవ్వనం మూర్తీభవించిందా అనిపిస్తోంది." అని అనుకొన్నాడు మైకేలు "ఎన్ని విధాల ఆలోచించినా ఇదే సక్రమమైన మార్గమని నాకు తోస్తోంది. 'ఆలస్యం-అమృతం విషం' అన్నారు పెద్దలు. చూడు ఇసబెల్లా లూక్‌కి ఏమేమి కావాలో అన్నీ త్వరగా తయారు చెయ్యి. మంచి మంచి దుస్తులు తయారు చేసి సిద్ధపర్చు. లూక్‌ని ఈవేళో, రేపో పంపుదాం" అని మైకేలు తేలిక బడిన హృదయంతో పొలాలకు పోయాడు. ఇసబెల్లా వరుసగా ఐదు రోజులపాటు నిద్రాహారాలు, విశ్రాంతి అనేవి చవి చూడకుండా తన మృదు పల్లవహస్తాలతో లూక్‌కి కావలిసిన బట్టలన్నింటిని తయారు చేసింది. ఆదివారం

వచ్చింది. ఇసబెల్లా తన పనిని పూర్తిచేసింది. అంత క్రితం రాత్రుల నుండి భర్త ఏలానిద్ర పట్టక పలవరిస్తూ తనయుని వియోగ బాధను తల్చుకొని బాధపడుతున్నదీ స్వయంగా చూచింది. దానితో ఆమె ఆశలన్నీ మటుమాయమయ్యాయి. ఉదయాన్నే గుమ్మంలో కూర్చుని లూక్‌ని దగ్గరకు తీసుకొని "నాయనా, నీవు లండన్ పోవద్దు. నీ వొక్కడవేగా మాకున్నదీ? నీవు వెళ్లితే నీ తండ్రి ఎంతో కాలం బ్రతకరు. ఆయన ఎంతో బాధపడుతున్నారు" అని కంట తడిపెట్టుకొంది ఇసబెల్లా. లూక్ కూడ దుఃఖాన్ని నిలుపుకోలేక పోయాడు.

ఒక వారం గడిచింది. ఇంతలో అనుకొన్నట్లుగానే లండన్ నగరంలోని బంధువు దగ్గరనుండి "తాను చేయగల్గిన సాయమంతా తప్పక చేస్తానని. పిల్ల వానిని తన దగ్గరే వుంచుకొంటానని త్వరలో లూక్‌ను పంపమని" జాబు వచ్చింది. మైకేలు కుటీరంలో ఆనందం మరల మొలకెత్తింది. ఆ ఉత్తరాన్ని ఆ ముదుసలి దంపతులు సుమారొక పది పదిహేను సార్లు తనివి తీరా చదువుకొన్నారు. ఇక ఇసబెల్లా ఆనందానికి అంతే లేదు. పరుగు పరుగున పోయి చుట్టుప్రక్కవారందరికీ ఆ ఉత్తరాన్ని చూపించి గ్రక్కున తిరిగి వచ్చింది.

ఇసబెల్లా ఇల్లు చేరేసరికి "లూక్ రేపే వెళ్లిపోవాలి" అన్నాడు మైకేలు. సుమారొక వారం రోజుల క్రితమే అన్ని పనులు పూర్తి చేసినా "అయ్యో! ఇంత అకస్మాత్తుగా పంపుతానంటే ఎల్లాగండీ! ఇంకా చూడవలిసినవి చాలా ఉన్నాయి. మరి మీరిలా తొందరచేస్తే నే నన్నీ మరిచిపోతానం"ది ఇసబెల్లా సహజ మాతృవాత్సల్యాన్ని ఒలికిస్తూ.

చిట్టచివరకు ఇసబెల్లా సమ్మతించింది. ముసలివాని మనస్సు కుదుటు పడడమే కాకుండా, ఆతని ముఖంలో చిరునవ్వు చిందులాడింది.

మైకేలు ఆ విశాలమైన కొండ లోయలో తన గొర్రెల కొక దొడ్డి కడదామని ఎన్నో రాళ్లు ఆ మూలన పేర్చాడు. ఇక పని ప్రారంభించడమే తడవుగా నున్న సమయంలో పిడుగులాంటి వార్త వచ్చిపడింది.

ఆ సాయంకాలం మైకేలు లూక్‌ను వెంట పెట్టుకొని ఆ ప్రదేశాన్ని సమీపించి లూక్ నుద్దేశించి ప్రారంభించాడు. "నా చిట్టి తండ్రీ రేపే నన్ను విడిచి నీవు వెళ్లిపోతావు. ఇంతవరకు మనం తోడునీడల్లాగ తిరిగాం. నీవు పుట్టినప్పటి నుంచి మనమిద్దరం ఏక జీవులుగానే జీవించాలని నా ఆశయం. నీ పుట్టుక వెలిగి వెలిగి ఆరిపోయిన నా జీవిత ప్రమిదలో తైలం వేసి జ్యోతిని వెలిగించింది. నిర్జీవంతో ఎండిన ఆనంద వృక్షాన్ని చిగురింప చేసింది. కాటికి కాళ్లు చాచిన నా జీవితంలో నూతన శకారంభాన్ని తీసికొని వచ్చింది. నాలో నవయౌవనాన్ని పునః సృష్టి చేసి, అంతులేని ఆశల్ని ఉత్సాహాల్ని కలుగచేసింది. కొద్దిగా మన పూర్వ జీవితాన్నిక్కడ ప్రస్తావిస్తా. అది నీకు మేలు కలుగచేస్తుంది"...

లూక్‌కి మానవ హృదయ ముంది. తండ్రి ఎప్పుడయితే తన జీవితంలోని ప్రతి చిన్న సంఘటనను పేర్కొన్నాడో పొంగి పొరలివచ్చే దుఃఖాన్ని ఆపుకోలేక ఒక్కసారి బారు మన్నాడు "కాదు నాయనా అట్లా తీసికోకు. ఇవన్నీ నీకిప్పుడు జ్ఞాపకం చేయడంలే" అని కొంచెం సేపాగి మరల అందుకొన్నాడు మైకేలు "నాకు 40 సంవత్సరాలున్నప్పుడీ భూము లనేక అప్పులలో సంక్రమించాయి. నేను నలుబది సంవత్సరాలు ఎండనక వాననక కష్టించి పనిచేశాను. భగవంతుని కృప నాపై ప్రసరించింది. అప్పులన్నీ తీర్చివేశాను. కష్టాలన్నీ గట్టెక్కాయి. మూడు వారాల క్రితందాక ఈ భూములు స్వేచ్ఛావాయువుల్ని పీలుస్తున్నాయి. ఒకసారి ఆ పచ్చటి బంగరు పొలాలకేసి చూడు 'బానిసత్వానికి తల లొగ్గమని సగర్వంగా నిలబడి ఏలా సమాధానమిస్తున్నాయో!' లూక్! నీకేమయినా కీడుచేయ తలచితే దేముడు నాకు నరకం విధించు గాక!" అని ఆగి ఆ రాళ్ల గుట్ట కేసి వ్రేలుపెట్టి చూపుతూ "ఈ పని మన ఇద్దరిదీను ఇప్పుడు దీనిని నే నొక్కడనే చెయ్యాల్సి ఉంది. అయినా పర్వాలేదు. ఏదీ నాయనా నీ చిట్టి చేతుల్తో ఒక రాయి తీసి అక్కడ శంకుస్థాపన చెయ్యి...ఎందుకు తండ్రీ అలా ఖేద పడతావు? ధైర్యం వీడకు. మన జీవితంలో మరొక మంచి రోజు చూడక పోంలే! నాకు 84 సంవత్సరాలు నిండినా, నా శక్తి సన్నగిల్లలేదు. నీ కర్తవ్యం నీవు సంతృప్తికరంగా నెరవేర్చు. నా పనిని నేను నిర్వర్తిస్తా. "లూక్,

ఈనాటి నుంచి నీవు బహు మెలకువతో మెలగాలి సుమా! దుర్మార్గుల నెవ్వరినీ దరిచేర నీయకు. దురలవాట్లచే ఆకర్షింప బడకు. నీ తండ్రి, తాత, ముత్తాతల అమాయక జీవితాలను స్ఫురణకు తెచ్చుకో. నీ యజమాని మాట జవదాటకు. సర్వేశ్వరుడు నీకు సకలరీతుల సహాయం చేస్తాడు. ఇవే నా ఆశీస్సులు. ఇదే నా వీడ్కోలు సందేశం. నీవు మరల తిరిగి వచ్చేటప్పటికి ఇక్కడొక నూతన కట్టడాన్ని చూస్తావు. అదే మన వీడ్కోలుకి చిహ్నం. లూక్! చివరి మాట చెబుతున్నా—నీ వధానికి గురి అయినా శుభానికి గురి అయినా, మంచి నలవర్చుకొన్నా చెడ్డ చేబట్టినా నీ తండ్రికి నీపైగల ప్రేమలో వీసమంతయినా తగ్గదు. ఆపవిత్ర ప్రేమ నే నా సమాధి దాకా తీసికొని పోతాను" అని మైకేలు తన ఉపదేశాలను ముగించాడు. వంచిన తల ఎత్తకుండా తండ్రి కోరిన ప్రకారం ఒక రాయిని ఎత్తి లూక్ గొర్రెల దొడ్డికి శంకుస్థాపన మహోత్సవాన్ని పూర్తి చేశాడు. ఈ దృశ్యాన్నంతా పరికిస్తున్న ముసలి వాని మనస్సు కరిగిపోయి తనయుని తనివితీరా కౌగలించుకొని ముద్దు పెట్టుకొన్నాడు. అప్రయత్నంగా మైకేలు కంటినుండి రెండు అశ్రువులు లూక్ భుజాలపై రాలాయి.

తండ్రీ తనయులిద్దరూ గృహోన్ముఖులయ్యారు. నిశ్శబ్దంగా నున్న కుటీరంలో ప్రవేశించారు. చీకటి పడింది—తెల్లవారింది. కుర్రవాడు ప్రయాణం ప్రారంభించాడు. రహదారికి రాగానే ధైర్యంగా తల పైకెత్తాడు. ఇరుగు పొరుగు వారంతా దైవప్రార్థనలతో ఆశీర్వచనాలతో వీడ్కోలిచ్చారు. తల్లి, తండ్రి, తనయుడు కనపడేదాక చూస్తూ ఆలాగే నిలబడ్డారు.........

లూక్ సక్రమంగా తన పనిని నిర్వర్తిస్తున్నట్లు బంధువు నుండీ ఉత్తరాలు వచ్చేవి. లూక్ లండన్ నగర వింతలను గూర్చి తల్లి దండ్రులకు ప్రేమామృతాన్ని చిలికి ఉత్తరాలు వ్రాసేవాడు. ఆ ఉత్తరాలను ముసలి దంపతులు పట్టరాని పరమానందంతో పదే పదే చదువుకొని మురిసి పోతూండే వారు. చాల మాసాలు గడిచాయి. ఇంతలో లూక్ చెడు సాహవాసాలకు దురభ్యాసాలకులోనై పని అశ్రద్ధ చేస్తూ తాను గావించే నీతిరహితమైన పనులకు ప్రతి ఫలంగా వచ్చే నిందలు భరింపలేక, తన ముఖం మర్యాదస్థులకు చూపలేక సిగ్గుతో, తీరని అవమానాలతో లండన్ విడచి ఇతర దేశాలకు పరారి అయ్యాడు.

అసలైన ప్రేమకి ఎన్ని దుర్భర కష్టాలవంటినా, క్షమతో ఓర్చుకొనే మహాశక్తి ఉంటుంది. పవిత్ర ప్రేమ కదే గీటు రాయి. ఆ ఓర్పు అనేది లోపించిందంటే అలాంటి విషాద వార్తలు విన్నప్పుడు ఆకస్మిక మరణాలు, మతిభ్రమలు సంక్రమిస్తాయి. 84 సంవత్సరాల వృద్ధాప్యంలో, ఎన్నో ఆశలు పెట్టుకొన్న ఏకైక బిడ్డ, తన పవిత్ర ప్రేమకు పాత్రుడయిన ఒకానొక బిడ్డ ఈ మాదిరిగా చెడు అలవాట్లకు బానిసై దేశాంతరగతుడయ్యాడనే ఘోరవార్త మైకేలును క్రుంగదీయ లేక పోయింది. పనిని తాను యథాతథంగా నెరవేర్చుకొంటూ తన అనుంగు గొర్రెలను మేపుకొంటూ సప్త సంవత్సరాల దీర్ఘకాలం జీవించగల్గాడు మైకేలు. అనేకపాటు పోట్లకు తట్టుకొని ప్రకృతి పోషణలో పెరిగిన మైకేలు మనోనిబ్బరాన్ని నిరూపించేందుకు ఈ నిదర్శన మొక్కటి చాలు.

అప్పుడప్పుడు మాత్రం తన కుమారునికి వీడ్కోలిచ్చిన ప్రదేశానికిమాత్రం పోయి మైకేలు కూర్చొని వస్తూండేవాడు. అతని కుక్క అతని కాళ్ల దగ్గర పడుకొని అతని కాళ్లు నాకేది. అమిత వాత్సల్యంతో దాని తల నిమురేవాడు మైకేలు. ఈ వార్తవిన్న తర్వాత ఒక్క రాయికూడ ఎత్తి కట్టనే లేదు. చిట్టచివరకు మైకేలు తన 91వ ఏట విశ్వమాత అయిన ప్రకృతిలో లీనమయ్యాడు. మైకేలు మరణించిన మరి మూడు సంవత్సరాలకు ఇసబెల్లా తన జీవిత యాత్రను చాలించింది. మనోవ్యథతో కటిక దరిద్రంతో, కడకు సరసన నిలబడి ధైర్యాన్నిచ్చే భర్తయినా లేకుండా ఆ దీర్ఘ వత్సరాలు మూడు ఇసబెల్లా ఏలా గడుపగల్గిందో ఊహింప నశక్యము.

ఇసబెల్లా మరణానంతరం మైకేలు భూములు వేలం వేయబడ్డాయి. స్వేచ్ఛాపవనాలను పీల్చే మైకేలు పొలాలు పరాయివాని క్రింద బానిసత్వంలో పడి ఊడిగం చేస్తున్నాయి. "సంధ్యతార" అని పిల్వబడే మైకేలు కుటీరాన్ని భూదేవి తనలో ఐక్యపర్చుకొంది. ఆ విశాలమైన లోయలో మైకేలు పేర్చిన రాళ్లు మాత్రం మనకీ విషాద గాథను జ్ఞప్తికి తెస్తూ ఆలాగే ఉండి పోయాయి.

★

మహిళా జాగృతి

తాలూకా మహిళా సంఘం, రాజమండ్రి

రాజమండ్రీ తాలూకా మహిళాసభ నవంబరు మాసంలో శ్రీమతి ఎ. కోటమ్మగారి అధ్యక్షతను జరిగింది. ఆహ్వాన సంఘాధ్యక్షురాలు శ్రీమతి కమలరామన్‌గారు స్వాగతోపన్యాసమిస్తూ శాసనసభలలోను, స్థానిక సంస్థలలోను స్త్రీలకెక్కువ స్థానాలివ్వాలన్నారు. భర్త ఆస్తిపై భార్యకు సంపూర్ణాధికారం వుండాలన్నారు.

శ్రీమతి కోటమ్మగారు అధ్యక్షోపన్యాసంలో బాలికలకు, బాలురకు ఒకే పాఠశాలలో విద్య గఱపకూడదని, గృహిణికి కావలసిన విద్య బాలుర పాఠశాలలో గఱపుటకు వీలు పడదని చెప్పారు. కస్తూర్బాగాంధీ స్మారకనిధి యాజమాన్యమున సీతానగరంలో నడుపబడుచున్న పాఠశాలవంటివి యింకా అనేకం స్థాపించవలెనన్నారు. బాలికలకు పాఠశాలలలో జీతములేకుండా విద్య గరపవలెననియు పూర్వము వలెనే యిప్పుడుకూడా కాకినాడ కాలేజీలో బాలికలకు ఉచితంగా విద్య నేర్పవలెనని పిఠాపురం మహారాజావారిని కోరుతూ తీర్మానించారు.

ఆ తర్వాత శ్రీమతులు అద్దేపల్లి వివేకానందాదేవిగారు, సి. హెచ్. చంద్రమతీదేవిగారు, డా॥ కామేశ్వరమ్మగారు ఉపన్యసించేరు.

బళ్లారి మహిళాసభ

క్రిందటి మాసంలో స్థానిక మహిళాసభ శ్రీమతి పి. పారిజాతంనాయుడుగారి అధ్యక్షతను జరిగింది.

జాతివైషమ్యాలు తొలగించి ప్రజలలో ఐక్యతను పెంపొందించటానికి అనువైన ప్రణాళికను తయారు చేయవలెనని రాష్ట్ర ప్రభుత్వాలను హెచ్చరించారు. ఏకపత్నీ చట్టము, వరకట్నాల నిషేధపుచట్టము, దేవదాసీ విధాన నిర్మూల చట్టము కావాలని తీర్మానించారు.

డా॥ మేకినాన్‌సతి, బి. కె. రాయ్‌సతి మొదలగువారు ఉపన్యసించినపిదప నృత్య గాన ప్రదర్శనాలు జరిగాయి.

అనంతపురంజిల్లా మహిళాసభ

నవంబరు 4 వ తేదీని అనంతపురంజిల్లా మహిళాసభ జరిగింది. శ్రీమతి కామెర్ల కమలరత్నమ్మగారు అధ్యక్షత వహించారు. ఆమె ఉపన్యసిస్తూ యిన్నిరోజులనుండి స్త్రీలు అబలలమనుకొంటున్న భావాన్ని విడిచిపెట్టి స్వతంత్ర భారతదేశ నిర్మాణ కార్యక్రమంలో స్త్రీలుకూడ ప్రధాన పాత్ర వహించి కృషిచేయాలని ఉద్ఘాటించారు.

బహుభార్యాత్వం, వరశుల్కం మొదలైన దురాచారాలు రూపుమాపాలని తీర్మానించారు. అనంతపురంలో స్త్రీలకు కళాశాలను స్థాపించాలని, జిల్లాలో ప్రసూతి వైద్యశాలలు, శిశు సంరక్షణాలయాలను ఏర్పాటుచేయాలని కోరారు.

ఏలూరు మహిళా కాంగ్రెస్

ఏలూరు స్థానిక 'సర్దార్ కాంగ్రెసు శిబిర' ఆవరణలో శ్రీమతి అయ్యదేవర బాల త్రిపురసుందరిగారి అధ్యక్షతను 'పట్టణ మహిళా కాంగ్రెసు'ను స్థాపించారు. ఆ సభకు 200 మంది స్త్రీలు సమావేశమయ్యారు.

వయోజన స్త్రీ సంఘం; వాల్తేరు

ఈ సంఘం వాల్తేరులో స్థాపింపబడి ఆరుమాసములైనది. ప్రారంభంలో శ్రీ దివాకర్ల వెంకటావధానిగారిచే "స్త్రీలకు ఆధునిక విద్యావిధాన మెంతవరకు అనుకూలము" అన్న విషయమై ఒక ఉపన్యాసమిప్పించారు. ఒక నెలలో పిల్లలచే "వెరైటీ ఎంటర్‌టైన్‌మెంటు" చేయించారు. ఇప్పుడు 50 మంది మెంబర్లు యీ సంఘంలో చేరేరని, లైబ్రరీకి కొన్ని గ్రంథాలుకూడ సేకరింపబడ్డాయని, యీ విధంగా మహిళాసంఘం దినదిన ప్రవర్ధమానమౌతూవుందని సంఘ కార్యదర్శిని శ్రీమతి యస్. కామేశ్వరిగారు తెలియజేస్తున్నారు.

కళావంతుల సంస్కరణసంఘం, విజయనగరం

కళావంతుల జాత్యాభివృద్ధికై అవసరమగు చట్టములను రాష్ట్రసంఘమువారు మదరాసు శాసన సభలో ప్యాసు చేయించు నిమిత్తమగు ఖర్చులను జిల్లాసంఘములకు వీలయినంత వరకు భరించవలసినదిగా కోరియున్నందున, విశాఖపట్టణం సంఘమువారు విజయనగరములో రూ 308/- వసూలుచేసి రాష్ట్రసంఘ సంయుక్త కార్యదర్శియగు శ్రీ భాస్కర్ల గోపాలకృష్ణమూర్తిగారికి పంపిరి.

నిజాంరాష్ట్ర మహిళా మహాసభ

నిజాంరాష్ట్ర మహిళా మహాసభ 18వ వార్షిక సమావేశం శ్రీ రాణీ అంబాబాయి రబ్వంత్ రాయరాయన్ గారి అధ్యక్షతను నవంబరు 21వ తేదీని జరిగింది. రాణీగారు ఉపన్యసిస్తూ దేశంలో చెలరేగిన మతకలహాలకు విషాదం తెలియ జేసారు.

స్త్రీలు ఆరోగ్య శాస్త్రం, శిశుపోషణ, చేతిపనులు నేర్చుకుని భర్త ఆర్జనకు ఆమె కూడ తోడ్పడుతూ గృహ జీవనాన్ని స్వర్గతుల్యంగా మార్చవచ్చునన్నారు. పురుషులతో బాటు స్త్రీలకుకూడ సమాన ప్రతిపత్తిని సంక్రమింప జేయాలన్నారు. ఈ కరవు రోజులలో ఆహారాన్ని అనవసరంగా వ్యర్థపరచకుండా పొదుపుగా వాడుకోవాలని స్త్రీలను హెచ్చరించారు.

మైసూరు సంస్థాన మహిళాసభ

నవంబరు 16వ తేదీని మైసూరు సంస్థాన మహిళాసభ, మైసూరు దివాన్ సర్. ఏ. రామస్వామి మొదలియార్ గారి సతీమణి అధ్యక్షతను జరిగింది. ఆమె ఉపన్యసిస్తూ మన దేశంలో స్త్రీ విద్యాభివృద్ధికి తగిన అవకాశాలు లేవని, ఈ విషయంలో మన విద్యావేత్తలు శ్రద్ధవహించాలని చెప్పారు. వయోజన స్త్రీ విద్యకుకూడ ఏర్పాట్లు జరగాలన్నారు.

మిత్ర రాజ్య సమితి రాయబారం నాయకురాలుగా వెళ్లిన విజయలక్ష్మి పండిట్ కృషిని అభినందించారు. స్త్రీల హక్కుల విషయంలో హిందూ ధర్మ శాస్త్రాన్ని సంస్కరించడానికి స్త్రీ పురుషులు సమానంగా వుండే ఒక ఉప సంఘాన్ని నియమించాలని ప్రభుత్వాన్ని కోరారు.

మహిళా సమాజం, బరంపురం

బరంపురం ఆంధ్ర మహిళా సమాజం 31వ వార్షికోత్సవం సమాజంవారి స్వంత భవనంలో శ్రీమతి గంపా శివకాంతమ్మగారి అధ్యక్షతను 21-11-46 తేదీ గురువారంనుండి నాలుగురోజులూ గొప్ప పర్వంగా జరిగింది.


ఈ వార్షికోత్సవాన్ని ప్రారంభంచేస్తూ శ్రీమతి బోడపాటి అలివేలమ్మగారు యిలా చెప్పారు:

" స్త్రీలకు సమాజమును స్థాపించడంలో మా ఆశయము క్లబ్బులలోవలె వినోద విలాసములకు కాదు, స్త్రీలు ముఖ్యంగా భారతస్త్రీలు చాలకాలంనుంచి, రాజకీయంగానూ, సాంఘికంగానూ, అన్నివిధాల వెనుకబడియున్నారు. వారి పురోభివృద్ధికి పాటుబడుటయే మా సమాజముయొక్క లక్ష్యం. భారత దేశంలో ఇప్పుడిప్పుడే నూత్న స్వాతంత్ర్య యుగోదయం అయింది. ఈవేళ భారత దేశం అగ్నిపరీక్షను ఎదుర్కోవలసి వచ్చింది. ఇప్పట్టున భారతస్త్రీలు తమ పాత్రను తాము నిర్వహించి 150 యేళ్ల భారతదేశ దాస్య శృంఖలను తెంచేందుకు సహాయపడాలి. "దేశంలో మూడవ వ్యక్తి మూలకంగా జరుగుతున్న అన్యాయాన్ని, అంతర్గతంగా వస్తున్న మహోపద్రవాన్ని భారతస్త్రీలు అర్థంచేసుకొని, దేశ స్వాతంత్ర్యసిద్ధికి నిర్మాణ కార్యక్రమాన్ని అనుసరించి పోరాడాలి. స్త్రీలంతా మహిళా అభ్యుదయానికి సహాయపడాలి."

తరువాత కార్యదర్శిని నివేదిక చదువుతూ శ్రీమతి బోడపాటి అలివేలమ్మగారు సమాజం స్థాపించిననాటినుండి (1906) సమాజ భవన నిర్మాణానికి, అభివృద్ధికి మహోపకారాలుచేసి శాశ్వత సహాయం చేసినవారినందరినీ అభినందించారు. గత సంవత్సరంలో సమాజంవారు జరిపిన కార్యక్రమాలు వాటి ప్రయోజనాన్ని గురించి స్మరించారు.

తే 22-11-46 దీ శుక్రవారం బాలికల నృత్య ప్రదర్శనం జరిగింది. చిరంజీవి తోటకమల నృత్యం సమర్థతతో ప్రదర్శించింది. ఈ ప్రదర్శనంలో చిరంజీవులు బోడపాటి రాధాకుమారి, బి. లక్ష్మి, బులుసు లలిత, ఎర్రమిల్లి సరోజని, పోచిరాజు రాజేశ్వరి, పాణి సరోజని, లక్ష్మీనారాయణమ్మ పాల్గొన్నారు.

★



దేశసేవ చేయాలనే ఉద్దేశంతో ఒకసోదరీమణి అవివాహితగా నుండిపోవాలని నిశ్చయించుకుంది. కాని ఇటీవల తనకు నచ్చిన పురుషుడు లభిస్తే వివాహం చేసుకుంది. ఐతే యిట్లా చేయడం తన ఆదర్శానికి విరుద్ధమైందని, దానివల్ల తానేదో పతనం పొందేనని ఆమె తలుస్తూయుంది. ఈ సందిగ్ధాన్ని ఆమె మనస్సునుంచి పోగొట్టాలని నేను చాల ప్రయత్నం చేసాను. సేవాభిరతితో, యువతులు వివాహం చేసుకోకపోవడం చాల ప్రశంసనీయమైన విషయమేగాని, అట్లా వుండగలిగినవారు కోటికి ఏ ఒక్కరో వుంటారు. వివాహమన్నది జీవితంలో ప్రకృతి సైజం; వివాహం చేసుకోవడం విరుద్ధమనకోవడం చాల పొరబాటు. తాను చేసిన ఏ కార్యమైనా తప్పని భావించేవాళ్లు ఎన్నివిధాల ప్రయత్నంచేసినా పైకి రాలేరు. వివాహమంటే చాల ఆదర్శప్రాయమైందని, పవిత్రమైందని గ్రహించి వివాహితులు ఆత్మనిగ్రహంతో చరించవలసియుంది. హిందూ ధర్మం ప్రకారం వివాహం, నాలుగు ఆశ్రమాలలో ఒకటి; నిజానికి మిగతా మూడు ఆశ్రమాలు దీనిమీదే ఆధారపడి వున్నాయి. కాని దురదృష్టవశాత్తు యీ రోజుల్లో వివాహమంటే కేవలం శారీరక సుఖానికే అని భావిస్తున్నారు, మిగతా మూడు ఆశ్రమాలు పట్టి నామమాత్రాలై పోయేయి.

అందుచేత పైన చెప్పిన సోదరి మాదిరిగా తలంచే స్త్రీల అందరి కర్తవ్యం ఏమిటంటే వివాహాన్ని తప్పపనిగా భావించక, దానికున్న పవిత్ర స్థానాన్ని గుర్తించి అందుకు అనుగుణ్యంగా ప్రవర్తించడమే. అందుకు కావలసిన ఆత్మనిగ్రహాన్ని అలవరచుకుంటే, సేవచేయడానికి వారి శక్తి సామర్థ్యాలు హెచ్చుతున్నాయని గ్రహించ గలుగుతారు. దేశసేవ చేయాలనుకునే స్త్రీ తప్పక తనతో ఏకీభవించే పురుషునే భర్తగా ఎన్నుకుంటుంది. అప్పుడు వారిద్దరూ కలిసి గావించే సేవ దేశాభ్యుదయానికి గొప్పగా తోడ్పడుతుంది.

మాతృ ధర్మాలను గురించి మన పిల్లలకు బోధించక పోవటం చాల శోచనీయమైన విషయం. వివాహం పవిత్రమైందని ఎప్పుడన్నామో అప్పుడు మాతృస్థానంకూడా మహత్తరమైందే. ఆదర్శమాత కావాలంటే అదేమీ అంత తేలికైన పనిగాదు. పిల్లలను సృష్టించటమన్నది గొప్ప బాధ్యతాయుతమైన కార్యం. తల్లి గర్భం ధరించింది ఆదిగా బిడ్డపుట్టేవరకుకూడ తన బాధ్యతను చక్కగా గుర్తించగలిగి వుండాలి. తెలివైనటువంటి, ఆరోగ్యవంతులైనటువంటి క్రమశిక్షణ పొందినటువంటి, బిడ్డలను తయారుచేసి, యివ్వగలగడం నిజంగా గొప్ప దేశసేవే. అటువంటి బిడ్డలు పెద్దవారైనప్పుడు దేశానికి చక్కగా సేవచేస్తారు. యథార్థంగా చెప్పాలంటే సేవచేయాలన్న ఉత్సాహం, ఉద్రేకం వాళ్లలోవున్నవాడు, వాళ్లు ఎటువంటి స్థానాలలో వున్నా ఏదో ఒకవిధంగా సేవచేస్తూ వేవుంటారు. అటువంటివాళ్లు సేవకు ఆటంకం కలిగే మార్గాన్ని ఎన్నడూ అవలంభించరు. —హరిజన్ 22-3-42.

సంసారయాత్రలో దేశసేవకు తావుందా?

ఆఫ్రికానుండి

కుష్ఠు ★ బొల్లి

బిబొఖర్ఖ

గ్యారంటీ చికిత్స!

వాడబడుచున్నవి మా ఔషధరాజములే!

ఋతుశూల నివారిణి

ఋతుకాలమున స్త్రీలకు గల్గుచుండెట్టి విపరీతమగు శూల నొప్పులనైనను మూడు రోజులలో తగ్గించును. ఎంతకాలము నుంచియున్నను, వెంటనే తగ్గును. ఋతుదినములు మూడింటనే వాడునది. ఋతుశూల నియ్యది మంత్రించి పట్లు బోగొట్టును.

ఒరిస్సా మంత్రి ప్రశంస

ఆనరబుల్ పండిట్ గోదావరిస్ మిశ్ర M.A.B.T.

తూర్పు గోదావరిజిల్లా గోపాలపురంలో శ్రీ రెడ్డి కంపెనీ వారు కుష్ఠువ్యాధికి తగు చికిత్స చేయుచున్నారని నేను యిందు మూలముగా చెప్పుచున్నాను. లోగడ వారు తెలిపిన యొక శ్రీరోగి కుష్ఠువ్యాధికి వారి చికిత్స పొంది రెండు మాసముల కాలములోనే విశేషగుణమును పొందెను. ఆమె యింకను వారి చికిత్స పొందుచున్నది. ఆమె పొందుచున్న అభివృద్ధినిబట్టి చూడగా అనతి కాలములోనే సంపూర్ణారోగ్యమును బడయుటకు సందేహములేదు. మానవకోటికి భయంకర శత్రువైన కుష్ఠువ్యాధిని నిర్మూలించుచున్న శ్రీ రెడ్డి అండుకో వారు ప్రజల అభివందనములకు పాత్రులు. వారి చికిత్సా విధానము డాక్టర్ల వల్ల హర్షింపదగినదిగా యున్నది.

కటకం
29-11-43

(సం) జి. మిశ్ర
మినిష్టరు
ఫైనాన్సు. ఎడ్యుకేషను. డెవలెప్‌మెంటు & పబ్లిసిటీ. ఒరిస్సా

సువర్ణ గంధక పుష్పం

స్త్రీలకు గలుగు ఋతుదోషములు అనగా ఋతుస్రావము (తెలుపు, ఎరుపు, నలుపు) రంగుమారుట—దుర్వాసన గలిగి యుండుట—అసలు బహిష్టియే గాకుండుట—మొదలగు సర్వ స్త్రీ ఋతుదోషములను పోగొట్టి, క్రమ ఋతువును గలిగించును. గొడ్రాండ్రు వాడిన సంతానవంతులగుదురు.

కొత్తగా అచ్చువేయబడిన మా పెద్ద తెలుగు క్యాటలాగు, 10 భాషలలో కేటలాగులు, యోగ్యతా పత్రములు

ఉచితము!

బ్రాంచ్ ఆఫీసులు:

బెజవాడ
గాంధినగర్.
★
అత్తిలి
బస్ రోడ్.
★

రెడ్డి & కో.,
(రిజిస్టర్డ్)
H. O.
గోపాలపురం,
తణుకు, తూ. గోదావరి

బ్రాంచ్ ఆఫీసులు:

సికింద్రాబాద్
3560, కింగ్స్ వే.
★
వాల్తేరు
R. S. పోష్టు
★
కటక్
బక్షి బజార్.

కుష్ఠురోగుల సేవ

మధ్య ఆఫ్రికా తప్పిస్తే, మనదేశం కుష్ఠు వ్యాధికి ఎక్కువ నివాసస్థానమైయుంది. కుష్ఠు వ్యాధి పీడితుల్ని గురించి శ్రద్ధ, సేవ గావించడానికి బదులు అశ్రద్ధ జరుగుతూయుంది. భారత దేశం సౌఖ్య ప్రదంగా స్వరాజ్యంతో తులదూగే రోజుల్లో ప్రజలచే అశ్రద్ధ చేయబడ్డ యాచకులుగాని, కుష్ఠురోగ బాధితులుగాని ఉండరాదన్న ఆశయంతోటే గాంధిమహాత్ముడు వీరి సేవ నిర్మాణ కార్యక్రమ హంశాల్లో ఒకటిగా చేర్చేడు. తాను స్వయంగా చేసేడు. మానవ సేవయే మాధవ సేవ అన్నాడు.

* * *

కుష్ఠురోగాన్ని ఎదుర్కొడానికి మద్రాసు ప్రభుత్వంవారు డా॥ ఆర్. జి. కాక్రేన్‌గార్ని ఒక స్కీము తయారు చేయమని నియోగించేరని— మొన్న నవంబరు నెల మధ్యంలో బ్రిటిష్ అంపైర్ లెప్రసీ రిలీఫ్ అసోషియేషన్ వారి రాష్ట్రీయశాఖ గవర్నమెంటు భవనంలో వార్షిక సమావేశం జరిగినప్పుడు ఆరోగ్య శాఖ మంత్రిణి శ్రీమతి రుక్మిణీలక్ష్మీపతిగారు చెప్పేరు. డా॥ ఎ. మెక్లీష్, అసోషియేషన్ సెక్రటరీగా సభికుల్ని ఆహ్వానించేరు. డా॥ ఆర్. జి. కాక్రేన్ గారు కుష్ఠురోగ నివారణకు, నిర్మూలనానికీ గూడ ప్రజలు ప్రభుత్వం అంతా తమ పూర్తి సహకారాన్నిచ్చి కృషి చేయాలన్నారు. శ్రీ టి. యస్. జగదీశన్‌గారు కుష్ఠురోగ పీడితులు ఈ రోగాన్ని మరుగు బెట్టకుండా బాహాటంగా బయటికి వచ్చి చికిత్సపొందే వాతావరణాన్ని ప్రజలు కల్పించాలన్నారు. గవర్నరు సతి లేడీనై గారు అసోసియేషన్ గావిస్తున్న కృషి ప్రస్తుతించేరు. మేజర్—జనరల్ జె. పి. హుబాన్, మద్రాసు ప్రభుత్వ సర్జన్ జనరల్‌గారి వందనార్పణలతో సభ ముగిసింది.

* * *

కుష్ఠురోగ చికిత్స తతిమ్మా రోగాల చికిత్సలాగే పరిగణింపబడాలి

కుష్ఠురోగ ప్రస్తుత వ్యాప్తిని గురించి, దాని చికిత్స, నిర్మూలనల్ని గురించి వాకబుచేసి రిపోర్టు చేయవలసిందని మద్రాసు ప్రభుత్వం వారిచే నియోగింపబడ్డ అడ్‌హాక్ కమిటీ మొన్న నవంబరు 11వ తేదీని సర్జన్ జనరల్‌గారి ఆఫీసులో శ్రీమతి రుక్మిణీలక్ష్మీపతిగారి అధ్యక్షత క్రింద సమావేశమైంది. ఈ కమిటీలో మెంబర్లు సర్జన్ జనరల్, డా॥ కాక్రేన్, కెప్టెన్ తంబయన్ మిసెస్ కురియన్, ప్రజారోగ్య శాఖ డైరెక్టరు గార్లు. శ్రీ టి. యస్. జగదీశన్‌గారు సెక్రటరీ.

కుష్ఠురోగ చికిత్స, తతిమ్మా రోగాల చికిత్సలాగే పరిగణింపబడాలని, చికిత్సతోబాటు, (రోగం రాకుండా ఆపడానికి గావించ వలసిన) నిరోధక మార్గాల్ని గురించి కూడా శ్రద్ధ వహించాలని కమిటీ అంగీకరించేరు.

ముందు జరుగబోయే సమావేశాల్లో కమిటీ వారు—గ్రామాల్లో కుష్ఠురోగ సమస్యనుగురించి ప్రస్తుతమున్న చికిత్సా కేంద్రాల అభివృద్ధిని గురించి, రోగాన్ని గురించి పరిశోధనలు చేయడానికి పరిశోధనాలయాల స్థాపన గురించి, కుష్ఠురోగ విషయమై ప్రజలకు తెలియ జెప్పడాన్ని గురించి, ప్రజలు, కుష్ఠు వ్యాధి పీడితుల్ని మామూలు రోగుల్లాగ పరిగణించడానికి చేయవలసిన కృషిని గురించి — విచారించడానికి నిశ్చయించేరు.

గాంధిజీ నిర్మాణ కార్యక్రమంలో ఒకటి

స్త్రీ స్వాతంత్ర్యోద్యమ ప్రగతి

* శ్రీమతి డి. దుర్గావతీదేవి, హిందీవిద్వాన్ *

నేటి యుగాన్ని కలియుగ మనుటకంటె క్రాంతి యుగ మన్న చాలావరకు వుచితముగా వుంటుందనుకుంటాను. ఇది వరకు మనకు స్వప్న వృత్తాంతములగు విషయములన్నియు క్రమక్రమముగా అమలులోనికి వచ్చి ఆశ్చర్యము కలుగజేయు చున్నవి. కాలచక్ర గతి ననుసరించి ప్రపంచమందు అన్ని క్షేత్రములలో తీవ్ర పరివర్తనలు జరుగుచున్నవి. రాజనైతిక ధార్మిక, సాంఘిక ఆచారవ్యవహారములందు విచిత్రమగు విప్లవములు పరివర్తనలు దృష్టి గోచరమగుచున్నవి. చైనా, జపాన్, రష్యా, టర్కీ మొదలైన దేశాలు తమ శాసన పద్ధతులలో వింతమార్పు చూపి శక్తి స్వాతంత్ర్యాలు ఒక వ్యక్తికిగాని, ఒక మార్గానికిగాని చెందినవి కావని సిద్ధాంతీకరించినవి. యెంత మందికి స్వాతంత్ర్య సామర్థ్యము లోపగిన ప్రపంచమున కంతటి శ్రేయస్కరము. స్వాతంత్ర్య మనుభవించే దేశీయులతో సమానముగా సాగుటకని భారతదేశము తన దాస్య బంధములను యెంతో నేర్పుతో—కష్టముతో వదలించుకొన వలసియున్నది.

ప్రపంచ వ్యాపకమగు విప్లవమునుండి స్త్రీలు మాత్ర మెట్లు తొలగియుందురు? వారును యీ వుద్యమమున ప్రవేశించి, తమ సామర్థ్యము కొలది పోరుచున్నారు. వాస్తవముగా, నేటి క్రాంతిలో స్త్రీ స్థితియందే యెక్కువ పరివర్తన జరుగుచున్నది. నేటి వరకు కొంత మంది మాత్రమే తమ జన్మ సిద్ధ అధికారము చేసుకొన్న స్వాతంత్ర్యము నేడు ప్రపంచములోని ప్రతి వ్యక్తియు సత్యాగ్రహమువల్లనో దురాగ్రహమువనో పంచుకొను చున్నారు. ప్రపంచములోని అన్ని వస్తువులకంటెను విలువైనది ప్రాణమేనను సామెత నేడు తల్లక్రిందులై ప్రాణము కన్నను ప్రియమైనది స్వతంత్ర మని రూఢియగుచున్నది. శత శతాబ్దములనుండి కొన్ని విశేష వర్గముల స్వాధీనమైయున్న శక్తి స్వాతంత్ర్యములను నేడు అనధికారు లందరు వశపర్చుకొనుట అనుకొన్నంత సులభమగు కార్యము గాదు. అయినను దాస్యభావమందు విరక్తి, స్వతంత్ర ప్రేమ, మనయందు జాగృతిపొందిన తర్వాత, యెంతటి దుర్బల వ్యక్తియందైనను యెట్టి అసాధ్య కార్యము చేయుటకైనను సాహస సామర్థ్యములు వుత్పన్నమగును. అనేకమంది స్త్రీ పురుషులు యీ భారమును వహించి స్వతంత్ర సమరమున సఫలీభూతులగుటకు గొప్ప వుద్యమములు నడుపుచుండిరి. యీ విప్లవము భారతదేశమందేకాక పాశ్చాత్య దేశమందును ప్రబలముగా కానవచ్చుచున్నది.

మన భారతదేశ స్వాతంత్ర్యసమస్య పాశ్చాత్యదేశములకు విరుద్ధముగా కనుపించుచున్నది. అచ్చట స్త్రీ పురుష భేద భావము మాని అన్య దేశీయులతో పోరుచున్నారు. కాని భారత వర్షమందు స్త్రీ పురుషుల మధ్యనే స్వతంత్ర సంగ్రామము జరుగుచున్నది. భారతీయులు తమ సర్వస్వము పోగొట్టుకొని విదేశీయుల బానిసలైరి. వారి అధికారము సురక్షితముగా వున్నది స్త్రీలయందు మాత్రమే. స్త్రీలకును స్వాతంత్ర్య మిచ్చి వారు చేయునదేమి? పోగా మిగిలిన దానిని యెక్కువ జాగ్రత్తగా వుంచుకొనుట మానవ స్వభావము కదా. జడతుల్యులుగా వున్న భారత స్త్రీలకు నేడు కొంత చైతన్యము కల్గినది కనుక వారును తమ స్వత్వముల కోరుచున్నారు. కాలక్రమము యెల్లప్పుడు ఒకే రీతిని వుండదు కావున విద్యావతులగు కొందరు స్త్రీలు యెన్నడో అంతరించిన తమ హక్కులను తిరిగి పొంది, దేశ దాస్య విముక్తి చేయుటకై బద్ధకంకణులై పాటుపడుచున్నారు. అనగా తమ బాధ్యతలను ముందుగా గుర్తించి, ఆ బాధ్యతల సక్రమ నిర్వహణకే యీ హక్కులను కోరుచున్నారు. స్త్రీ పురుషు లిద్దరును ప్రకృతి—పురుష శక్తుల భిన్నరూపములు కనుక యెక్కువ తక్కువ లేమియు లేవు. మన వేద శాస్త్రము లెంత వుదార ఆశయములతో నిండి వున్నను

కొన్ని వందల సంవత్సరములనుండి స్త్రీల దశ, చాల శోచనీయముగానే వున్నది.

నేటి వరకు భారత స్త్రీ స్థితి యెంత హీనముగా వున్నది, వీరి వున్నతి మార్గమున యెటువంటి ఆటంకములు పోగైనది విచారణీయమగు విషయమే. రాజనీతి విభాగమందు స్త్రీలకు బొత్తిగా స్థానము కనిపించదు. వీరియందు ఆకార్యము నెరవేర్చు యోగ్యతా నేర్పులు లేకనేనా? అటువంటి అవకాశము యెప్పుడైనా లభించిన గదా వీరి యోగ్యతా యోగ్యతలు బయల్పడుటకు. దూరదృష్టి, శౌర్య, ధైర్యసాహసములు మొదలగు రాజనీతికి అవసరమగు గుణములు పురుషుల కంటె యెక్కువగానే స్త్రీ యందున్నవి. అనేక మంది నారీమణులు తమ మార్గకంటకములన్నిటిని నిర్మూలించి, తమ పరాక్రమ ప్రవీణతలను ప్రపంచమున ప్రదర్శించి, పురుషులను లజ్జింప జేసిరి. ఇట్టి అనేక అనుపమ వుదాహరణలతో ప్రపంచ ఇతిహాసము నిండియున్నది. హైందవ ఇతిహాసము చూచినను అహల్యాబాయి, లక్ష్మిబాయి, తారాబాయి, రాణీ పద్మినీ, రాణీ దుర్గావతీ మొదలైన వీర కాంతల ప్రదీప్త గుణములు ప్రదర్శింపబడుచున్నవి. ఒక వేళ మనకు ఇతిహాస ప్రమాణములనుకూడా అసత్యమని రద్దు చేసినను నేడు మాత్రము వీర కాంతలు లేరా? నేటికిని అనేక కష్టముల కోర్చి తమ సర్వము దేశము కొరకు త్యాగము చేసి దేశ స్వాతంత్రము మానవ కల్యాణమునకై కృషి చేయుచున్న కాంతారత్నములు గలరు. వుదాహరణకు కస్తూరీబాయి గాంధి, కమలాదేవి, సరోజినీదేవి, ముత్తులక్ష్మి రెడ్డి, విజయలక్ష్మి పండిట్, మొదలగువారు చాలరా? వీరు పురుషులకంటె శక్తి సామర్థ్యాలలో తీసిపోరు. వీరికి అటువంటి అనుకూల పరిస్థితులు, అవకాశములు లభించనందున ప్రాచీన వీరకాంతలవలె రాజ్య సంచాలన చేయుట, కృపాణముగొని అరివర్గమును చెండాడుట చేయలేకుండిరి. నేటి పురుషులు మాత్రమట్టి కార్యములు చేయ సమర్థులైయుండిరా? "మరితర్ నేర్వగరాని విద్య కలదే ముద్దార నేర్పించినన్" అన్న ఆర్యోక్తి ననుసరించి అవకాశానుకూలములు లభించి స్త్రీలకు ఉన్నత విద్యా స్వాతంత్ర్యము లిచ్చిన స్త్రీలు చేయలేని కార్యమేది? సంపూర్తిగా తొలగకున్నను నేటి స్త్రీ దాస్య శృంఖలాలు కొంతవరకు బిగువు తప్పినవి. కనుకనే అనేకమంది కాంతలు వున్నతవిద్య అభ్యసించి, వివిధ విభాగములలో తమ బుద్ధి కుశలతను ప్రకటించుచున్నారు. న్యాయవాదినులు, న్యాయాధికారిణుల సంఖ్య తగ్గియున్నను డాక్టర్ల సంఖ్య వుపాధ్యాయినుల సంఖ్య కొంచెం హెచ్చినది. వీరు యెట్టి నేర్పు శ్రద్ధలతో, తమ బాధ్యతలను నిర్వర్తింపుచుండిరో అది పురుషులందు అరుదుగా కనిపించును. ఇందుకు ముఖ్య కారణము ఓర్పు వుదారత్వము పురుషుని కంటె స్త్రీయందధికముగా వుండును. అయినను అనాది పరంపరగా వచ్చుచున్న సంకుచిత భావములు ఒక్కసారిగా అంతరించక పోవుటచేతను, ఆర్థిక పరిస్థితుల దురవస్థవల్లను సంపూర్ణ స్త్రీ లోకమునకు విద్యా స్వతంత్రములు ఇంకను దూరముగానే వున్నవి. అసంఖ్యాకులైన స్త్రీలలో అల్ప సంఖ్యాకులగు ప్రతిభా సంపన్నులు కానవచ్చుటకిదే కారణము. ప్రపంచమునకు భారత నారీ తేజము, ప్రదర్శింపవలెనన్న భారతమాతను శాశ్వత శక్తి సంపన్నగా చేయ గోరిన, ప్రభుత్వము స్త్రీ విద్యా స్వాతంత్రములందు యెక్కువ శ్రద్ధవహింపవలెను—స్త్రీ పురుష (పక్షపాత) భేద భావము వదలి శాసన సంచాలన చేయవలెను. ప్రభుత్వము తలచిన అసాధ్యమగు బాల్య వివాహ దురాచారము పోలేదా? కన్యాశుల్క వరవిక్రయములు మద్యపాన పిశాచము నశించు తరుణము రాలేదా? మన అదృష్టమువల్ల నేడు జాతీయ ప్రభుత్వము వచ్చినది. విదేశీ సర్కారు ఇంతవరకు గమనించని లోటుపాట్లన్నియు జాతీయ నాయకులు విశాల హృదయముతో తిలకించెదరు గాక. స్త్రీలకు అనివార్య నిశ్శుల్క విద్యా వ్యాప్తి చేసి సర్వహక్కులొసగెదరు గాక. ఒరిస్సా ప్రభుత్వంవారు ఉద్యోగములకు స్త్రీ పురుషులు సమానముగా పరిగణింపబడుదురని చక్కగ ప్రకటించిరి.

ఇక ధార్మిక ఇతిహాసము వైపు మరలుదము. ప్రపంచ రంగస్థలమున అనేక ధర్మోపదేశకులు జన్మించిరి. కాని ధర్మోపదేశిక ప్రసంగ మెచ్చటను లేదు. ధార్మిక గాఢ తత్వజ్ఞానము పొంది మననము చేయుట, దాని యోగ్యతను నిర్ణయించి ధార్మిక విచార ప్రచారము చేయుట స్త్రీ

జాతికి నిషిద్ధమని నిర్ణయించినప్పుడు వీరు ప్రసిద్ధి కెట్లు వత్తురు? స్త్రీలకు గీతాపారాయణము చేయుటకుగాని, వేద పఠనము వినుటకుగాని అధికారము లేదని కొందరు మహానుభావులు నిర్ణయించిరి. కేవలము దాస్యాధికారమే స్త్రీలకు మిగిలినది. కాని నేడు అనగా పురుషులు ధార్మిక ఆచారములను, సంధ్యాపూజా విధానములను త్యజించి జాతి మత భేదములు వదలి విశ్వమే ఏకకుటుంబము చేయ నిశ్చయించిన తర్వాత ధర్మ రక్షణ చేయగలది స్త్రీయే యనుట ఒక 'ఫేషన్' అయిపోయింది. వేద శాస్త్రములన్న యేమో, ధర్మమెట్లుండునో స్త్రీ యెరిగినగదా ఆమె ధర్మ రక్షణ చేయుటకు వదలుటకు?

ఇక పరివార సందర్భములందు నారీ ఆదర సత్కారము లెట్లున్నవో గమనించుదము. స్త్రీ పురుషులిద్దరును సమానాధికారులని పురాణేతిహాస అధ్యయనమువల్ల తెలియుచున్నది. కాని ఆ కల్పన యెన్నడు అమలులో వున్నట్లు కనిపించదు. స్త్రీ పురుషుని కీలు బొమ్మయే కాని స్వతంత్రము శూన్యము. కావుననే పురుషుడు భార్యా బిడ్డలను ఇచ్ఛానుసారముగా వేధించుచు, అమ్ముకొనుచూ, అవసరమున్న కుదువ పెట్టుకొనుచూ వారిపై చేతనైనంత అత్యాచారములు చేయుచున్నాడు. వుపరి స్త్రీ ఋణగ్రస్తము తినుచూ పురుషునికి భార స్వరూపముగా వున్నదని నిందించెదరు. మాటాడుటకైనా హక్కులేని నీచ బానిస, పురుషుని కే విధమున తోడ్పడగలదు? స్త్రీకి తనకని పెంచిన బిడ్డలయందుగాని తదితర వస్తువులయందుగాని యెట్టి అధికారము లేకుండుట యెంత అన్యాయము?

నారీ జీవిత మీ విధముగా పదదళితము చేసి, అబలలు, అమాయికలు, అశక్తలు, జ్ఞానశూన్యలని విశేషణములు తగిలించి, వారికి శక్తి సామర్థ్యములు లేవనుట యేమి అందముగా వున్నది? మట్టిలో పూడ్చి పెట్టిన మాణిక్యమైన యెట్లు ప్రకాశించును? గాజుముక్క కూడా మెరుగు పెట్టిన ప్రకాశించును. కనుక విద్యా సంస్కారములున్న స్త్రీ బుద్ధి కుశలత్వముకూడా బయల్పడగలదు? నాల్గు వైపులనుండి బంధించి పనుగత్తదేమనుటలో యేమైన అర్థమున్నదా? చాలా కాలమువరకు స్త్రీలకు విద్య అవసరమన్న మాటయే యెవరికీ తోచలేదు. వారు కేవలము జనాభా లెక్క కొరకే పురుషుల తలంపు, నేటికిని అట్టి వారు కొందరున్నారు! ప్రపంచము పరివర్తన శీల. కాల క్రమము ననుసరించి జడవస్తువునందు కూడా మార్పు జరుగుచుండును. మానవ శ్రేణికి చెందిన స్త్రీ జాతిలో పరివర్తన జరుగుటలో ఆశ్చర్యము లేదు. తరతాలనుండి వచ్చుచున్న ఆచార వ్యవహారాలు అభిప్రాయములు తల్లక్రిందులౌచున్నవి. స్త్రీ విద్య ప్రబలుచున్నది. యెక్కువ సంతోషమగు విషయము జాతీయ ప్రభుత్వము స్త్రీ విద్యాభివృద్ధికి, వారి హక్కుల పునరుద్ధారణకు కృషి చేయుచున్నది. దాస్య దినము అంతరించు సమయము వచ్చినది. ప్రత్యేక విషయమందు స్త్రీలకు స్వతంత్రము ఇవ్వబడుచున్నది. నేడు పురుషుని తోపాటు స్త్రీకిగూడ నిర్వర్తింపవలసిన బాధ్యతలున్నవి. స్త్రీలు తమ కిచ్చిన స్వాతంత్ర సామర్థ్యముల ననుసరించి దేశ కల్యాణముకొరకు సర్వశక్తులను ధారపోయుచున్నారు. స్త్రీ స్వతంత్రోద్యమము, మందగమనముగా వున్నను మన మేలుకేనని తలచవలెను. యెంత ఆలస్యముగా లభించిన వస్తువు అంత స్థిరముగా వుండునని చెప్పుదురు.

భారత నారీమణి సకలావస్థలు జూచిన ముత్తైదు వంటిది. పాశ్చాత్య స్త్రీలు నవయౌవ్వనమునకు వచ్చిన నారీమణుల వంటివారు. ఇందు ఎవరు ఎవరిని అనుకరించుట యనునది చాల వివేక దృష్టితో వితర్కించ వలసియున్నది. అదిగాక, పాశ్చాత్య వ్యామోహమున గెంతుతున్నామను కొనక—ఆ గెంతునది గోతిలోనికా, మెట్టుపైకాయని గ్రహించవలసియున్నది. అవకాశము లిచ్చినచో భారత నారీమణి సకల దేశీయులకు మార్గదర్శిని కాగలదు.

స్త్రీ స్వాతంత్రమనిన కాలసర్పమునకు వెరచినట్లు వెనుకకు తగ్గు పురుషులను చూచి వారి అమాయకత్వమునకు నవ్వువచ్చుచున్నది. స్త్రీ స్వతంత్రురాలైన సాంఘిక పారివారిక నియమములు వుల్లంఘించునని కుటుంబమునకు హాని వచ్చునని వారి వెఱ్ఱి భ్రమ. నిజముగా ఇట్టి తలంపు నిరాధారమైనది. దయా, క్షమా, ప్రేమ, సౌజన్యములు స్త్రీ సహజ గుణములు. విద్యా సంస్కారములవల్ల యీ గుణము లింకను రాణించును. ఇక ముందు స్త్రీ పురుషుని అర్థాంగియై సహా

చరిత్రయైవుండును కాని బానిసయైవుండ జాలదు—తన అనాదరము సహింప జాలదు. గృహయజమానియై యెట్టి కష్టమైనను సహించునుగాని, దాసిగా మాట అయినా ఓర్వదు. ప్రపంచములోని ప్రాణులన్నియు స్వతంత్ర ప్రియమైనవే. కనుక స్త్రీ ప్రేమకు లోబడును కాని అధికారము చేత లోబఱ్చుకొన జాలమన్న మాట ప్రతి పురుషుడు తెలుసుకొని వారికి వుచిత ఆదర స్వాతంత్ర్యముల నిచ్చుట మిక్కిలి శ్రేయస్కరము. భారత స్త్రీ తన హక్కులను కోరుచుండుటకు కారణము తన కర్తవ్యములను "షట్కర్మ యుక్తా కుల ధర్మపత్నీ" యని సవ్యముగా నిర్వర్తించుటకై యేయున్నది! గాని కళ్లెము లేని గుఱ్ఱముగా విహరించుటకు యెంత మాత్రమును గాదని గ్రహించెదరు గాక.



దృశ్యం:
సింహళసముద్రతీరం

★

రచన:
కె. భాగేశ్వరశర్మ

ANJAN NARIKEL

అంజన్ నారికేళ

నేత్రవ్యాధులకు చల్లని సిద్ధాంజనము. కండ్ల మంట, భారము, పోటు, మెరుపు, దురద, పుసులు, మసకలు, దుర్నీరు మొదలైనవాటిని పోగొట్టి దృష్టికి తేట తేజములను కలిగించును. రేజీకటి, ఎండచూడలేకపోవుట వగైరాలకు గూడా చాలా ఉపయోగము. వెల 0-12-0

BAITHOL ANJAN

for ACHES & PAINS

భేతాళాంజన్

ఇది మంచి పరిమళమును ఘాటును గల తైలము. తలనొప్పి, మెడనొప్పి, గొంతునొప్పి, రొమ్ము నొప్పి, వాయువు నొప్పులు, కీళ్ళ నొప్పులు, బెణుకులు, పట్లు, పోట్లు, తీపులు, వాపులు అన్నిటిని క్షణములో పారదోలును. వెల 0-12-0

BAWAJ

for SKIN DISEASE

బావాజి

(చర్మవ్యాధులకు)

దురదలు, ఎక్జిమా, గజ్జి, కురుపులు, తామర పొడ, దద్దులు, మొటిమలు, తీట, పురుగుకాట్లు, చెక్కుడు గాయములు, మొదలగు చర్మవ్యాధులకు ప్రశస్తముగా పనిచేయును. బట్టలను పాడుచేయదు. వెల 0-12-0

KESRINE

(HAIR TONIC)

కేశరీన్

(టానిక్ హెయిర్ ఆయిల్)

జబ్బుపడుటవలననో, మానసిక కష్టముల వలననో, దుర్బల శరీరతత్వమువలననో, మానవుల నరములు క్షీణించి తన్మూలమున చుండు, దురద అకాలముందే జుట్టుఊడిపోవుట, నెరయుట, బట్టతలయగుట ఇట్టివి తటస్థించును. అట్టి వారికి కేశరీన్ బాగుగా ఉపయోగపడును. శిరోజములను, దట్టముగాను, అందముగాను పెంచును.

వెల 0-12-0

VICTOR

(RINGWORM CURE)

విక్టరు

(తామర నాశని)

తామర, తీట, పొడలు మూడు పూతలతో కుదిరి చర్మము శుభ్రపడును. వెల 0-10-0

పోస్టేజి ప్రత్యేకము : వర్తకులకు స్పెషలు రేట్లు.

వివరములకు :

విక్టోరియా డిపో,

7, నార్తుమాడావీధి, మైలాపూరు, మద్రాసు. 4

ఏమి మగవాళ్లు

ఏకాంకిక నాటికల సంపుటి. శ్రీ పి. వి. రాజమన్నారుగారిచే రచింపబడి ఆంధ్ర అభ్యుదయ రచయితల సంఘంచే ప్రచురింపబడినది. దీని వెల 0-12-0.



ఇందులో ఏమి మగవాళ్లు, నిష్ఫలం, వృథాయాసం, సంకల్ప పర్యవసానం, మాతృప్రేమ, విముక్తి, దయ్యాల లంక, అను నాటకములు ఉన్నవి. ఈ నాటకములు పురాతన నూతన భావాల సంమిళితములు. కథ చదువుటకు పది నిమిషములు మాత్రమేయగును కాని ఇందులో విజయము సనాతనులకా లేక సంస్కర్తలకా అని నిశ్చయించడం కష్టసాధ్యమే. ఇదిగాక కథకు పేరుకుగల సంబంధమును కనుగొనుటకు చాలా యోచించి, కథను బాగా అవగాహన చేసుకొనవలసియుండును.

దీనివల్ల పుస్తక విషయములు పాఠకులకు మనుపురానివిగాను యోచనాశక్తిని నిశితమొనర్చునవిగాను ఉన్నవి.

ముఖ్యముగా ఇందు సంస్కర్తలమని బయలుదేరు ప్రతీవ్యక్తికి ఘాటైన హెచ్చరికలున్నవి. సంస్కరణకు మనోనిశ్చలం, పట్టుదల, నిస్వార్థత, కలిగి విఘ్నాయాసములను లక్ష్యపెట్టక కార్యశూరుడై ఉన్నవాడే తగునని నిరూపించబడినది. పై గుణములులేక, కేవలము డంభమునకు మాత్రమే సంస్కారము చేయకోరువారు, సంఘమునకు హానిచేసినవారు మాత్రమేగాక, సనాతనులకీ పరోక్షముగా మేలు చేసినవారగుదురని నిర్ణయింపబడినది.

—ఆర్. రమాబాయి.

శ్రీమహర్షి జీవిత కథామృతము

శ్రీ బులుసు వెంకటేశ్వర్లుగారు మహాపురుషుల చరిత్రలు మంచి భక్తి—జ్ఞానదాయకములుగా రచించ నేర్చిన నేర్పరులగుట ఆంధ్రులకు చిరపరిచితులే.

మహాఋషుల జీవిత ఘట్టాల్ని అక్కడక్కడ చెదురుగా చదవడమే గాని, అవి మన కొక గ్రంథ రూపంగా లేకపోయేయన్న కొరత వీరు అనోఘంగా తీర్చేరు. శ్రుతి స్మృతి పురాణేతిహాసాదుల్నుంచి వీటిని యేర్చి, కూర్చి, మనోహరమైన గ్రాంథిక భాషలో ప్రాచీన భారత వర్ష మహర్షుల జీవిత చరిత్రల్ని రెండు భాగాలుగా ముద్రించేరు. మా కార్యాలయానికి చేరిన—రెండవభాగంలో నారద, పరాశర, భరద్వాజ, భృగు, మార్కండేయ, యాజ్ఞవల్క్య, వశిష్ట, విశ్వామిత్ర, వ్యాస, శ్రీశుక మహర్షుల జీవిత చరిత్రలువారి బోధలు, సంక్షేపంగా 184 పేజీల్లో రచించేరు.

క. "ఎరుకగలవారి చరితలు
గరచుచు సజ్జనులగోష్ఠి గదలకధర్మం
బెరుగుచు, నెరిగినదానిని
మరువకనుష్ఠింపుమనది సమంజస బుద్ధిన్"

అని పెద్దలన్నారు గనుక—అందరూ, ముఖ్యంగా స్త్రీలు ఆధునిక మహాపురుషుల చరిత్రలతో బాటు ప్రాచీన భారతవర్ష మహర్షుల చరిత్రలు గూడ పఠించవలసియుంది. ఐతే మహర్షుల వాక్యాలే మన కనుష్ఠేయాలు గాని వారి చర్యలు మన మనుకరించరాదు, అనుకరించలేము.

"నానుష్ఠేయంతు తత్సర్వం। మునిభిర్య దనుష్ఠితమ్।
వాక్యమేవానుకర్తవ్యం। పండితైః పరమోహతైః॥"

ఈ గ్రంథం శ్రీ వావిళ్ల ప్రెస్‌వారు ముద్రించేరు. ఒక్కొక భాగం రెండు రూపాయలు, గ్రంథకర్తగార్కి—రామారావుపేట, కాకినాడ చిరునామాకు వ్రాస్తే పుస్తకాలు లభిస్తాయి.

"వారం వారం"

రచయిత: శ్రీ శ్రీరంగం శ్రీనివాసరావుగారు

ప్రకాశకులు: ప్రతిమా బుక్స్, ఏలూరు. వెల ఒక రూపాయి.

"వారం వారం" అనే శీర్షిక క్రింద దాదాపు వారం వారం 'ఆనందవాణి' పత్రికలో నేను రాస్తూ వచ్చిన రచనల సంపుటి యిది అని రచయిత ఉపోద్ఘాతంలో చెప్పారు.

★ గ్రంథసమీక్ష ★

సాహిత్య రచనలో ఆరితేరిన యీ గ్రంథకర్త తన ప్రజ్ఞను పత్రికలో శీర్షికా రచయితగా (Columnist) కూడా యీ పుస్తకంలో రుజువుపరుచుకుంటున్నారు. సులభమైన, హాస్యమైన భాషలో జటిలమైన రాజకీయ, ఆర్థికాభిప్రాయాలనూ, ఊహాలను, విమర్శలను వ్యక్తీకరించడం పాశ్చాత్య పత్రికారచనలో పుట్టిన ఆధునికపద్ధతి. ఈ గ్రంథకర్త అట్టి నూతన పద్ధతిని అనుకరించి ఈ చిన్ని చిన్ని వ్యాస రచనలను సృష్టించారు.

వీరి రాజకీయ విమర్శ ఎంత వినోదంగా వుంటుందో చూడండి. ఒక వ్యాసంలో—'ఈ రోజుల్లో తరుచూ తరుచూ వినబడేదేగాని ఎక్కడా కనబడేదికానిది ఏది?' అని ప్రశ్నించుకుని, 'స్వాతంత్ర్యం' అని జవాబిచ్చారు. మరొక వ్యాసంలో 'ఇది యంత్రయుగం, పారిశ్రామిక యుగం, వైజ్ఞానిక యుగం' అని చెప్పి ప్రారంభించి, 'అన్నిటికన్నా నడిపించడంలో కష్టమైన యంత్రం ప్రజాపరిపాలనా యంత్రం', అని చెప్పి ముగించారు. మరొకచోట 'ఏమయినా ఈ ఇరవయ్యో శతాబ్దాన్ని సఫల శతాబ్దమని చెప్పక తప్పదు. వాటిలో పాల్గొంటున్న వారికి ఏమాత్రం "సభ్యత" వుండనడం వేరే సంగతి', అన్నారు మరొక సందర్భాన్ని!

వీరి రచనలో తమాషా చాలావుంది. రాజకీయ, సాంఘిక విషయాలేకాక సాహిత్య, కళా సంబంధమైన విషయాలను గురించికూడా విచిత్రమైన రీతిగా వినూతమైన అభిప్రాయాలు ఈ 'వారం వారం' అనే చిన్న పుస్తకంలోని అల్పమైన వ్యాసాలలో విరజిమ్మబడి వున్నాయి.

ఈ పుస్తకం తెలివైన పాఠకులకి బాగా వినోదం కలిగించగలదు.

—శ్రీమతి మల్లవరపు విజయలక్ష్మి

★

నిర్మలాదేవి గ్రంథాలయము

ఆంధ్ర మహిళా సభ

మా నిర్మలాదేవి గ్రంథాలయము దినదినాభివృద్ధిపొందుతున్నదని చెప్పటానికి చాల సంతోషముగా వున్నది. శ్రీమతి పి. భాస్కరమ్మగారు గ్రంథాలయమునకు యిచ్చిన నూరు రూపాయల విరాళముతోను ఆమె కోరికప్రకారము దాదాపు 60 ఉపయోగకరములయిన హిందీ పుస్తకములు కొన్నాము. శ్రీమతి కొమ్మూరి పద్మావతీదేవిగారు 22 తెలుగు గ్రంథాలను, శ్రీమతి పొత్తూరి కామేశ్వరమ్మగారు 13 తెలుగు గ్రంథాలను కానుకగా ఇచ్చారు. శ్రీయుతులు గాలి బాలసుందరరావుగారు 25 రూపాయలను, పి. శేషాబు గారు కొన్ని గ్రంథాలను పంపించారు. పై దాతల సద్భావమునకు మా కృతజ్ఞత.

తోటి సంస్థలతో సంబంధము, పరిచయము కలిగివుండుటకొరకు నిర్మలాదేవి గ్రంథాలయము ఆంధ్రదేశ గ్రంథాలయ సంఘములో సభ్యత్వము వహించింది. అనుబంధముగా వున్న పఠనమందిరమునకు యిదివరకటి 30 పత్రికలుగాక యింకా నాలుగు క్రొత్తవికూడ వస్తున్నవి. గడువులోపుగ తీసుకున్న పుస్తకములను సక్రమముగ తిరిగియిచ్చి జరిమానా విధానమును అమలులో పెట్టవవసరములేకుండ సహకరిస్తున్న సభ్యురాండ్రకు కృతజ్ఞత.

అచ్యుతుని గిరిజ,
గ్రంథాలయ కార్యదర్శిని.

ఏమి ప్రపంచకమిది!

శ్రీమతి పి. హెచ్. అరవిందాదేవిగారు

అది వసంతకాలం

ప్రొద్దుట నీరెండ క్రొత్తగా చిగిర్చిన చెట్లన్నిటికీ బంగారు తొడుగు మలాము చేసినా అన్నట్లు మనోజ్ఞంగా వుంది. తల్లి, బిందె భుజాన్ని పెట్టుకుని, చెరువుకు నీళ్లకెళుతుంది; ఏక పిల్ల, బంగరుపాప, తల్లి పైటచెంగు పట్టుకుని, కాళ్లగజ్జెలు గలగల్లాడుతూ, చిట్టిచిట్టి అడుగులతో కూడా తయారైంది.

"ఆనుకో అమ్మా! ఇప్పుడే వస్తానం"టే వినక-చంకెక్కింది. పిల్లలకు ప్రతీదీ క్రొత్తగానే యుంటుంది—ప్రశ్నలకు జవాబు చెప్పడానికి తల్లికి వ్యవధియైనా లేకుండా చిట్టితల్లి "ఇదేమిటే-అదేమిటే" అంటూ ప్రశ్న పరంపర కురిపించేస్తూయుంది. చిట్టిని పావంచాలమీద దింపి, పైట సర్దుకుంటూంది తల్లి.

"అమ్మా! చూడవే—ఎలా మెరుస్తుందో-ఏంటిదీ?"

"చేపమ్మా!—ముట్టుకోకూడదు. చెర్లోచేప—పాపిష్టి జాలరిలావుంది—ప్రొద్దుటే వల యిక్కడ దులిపేడు."...

"కదలకుండా ఎలా చూస్తుందో చూడవే అమ్మా"...

"చూడ్డం కాదమ్మా. ఎక్కడ చూడ్డం! చచ్చి పోయింది."

"చచ్చిపోయిందా—ఎందుకు చచ్చిపోయిందీ?"

"ఎందుకేమిటే వెర్రితల్లీ!—నీట్లో చేపను బయట పడేస్తే..."

"వాళ్ల అమ్మ ఏడవదూ—పాపం! చచ్చిపోయిందా!"...

నీళ్లబిందె భుజాన్ని, పాపను చంకను పెట్టుకుని తల్లి యిల్లు జేరింది.

* * *

అది హేమంతం

ప్రాతఃకాలన్నే వృక్షపర్ణాలనుండి హిమబిందువులు బొటబొటా రాలుతున్నాయి. పావంచాలమీద బిందె పెట్టి బట్ట సర్దుకుంటూంది ఆవిడ. ప్రక్కనే గట్టున చిరుచేప చచ్చి పడియుంది......

"పాపం—వాళ్ల అమ్మ ఏడవదూ?" అన్న ప్రశ్న చెవుల్లో గింగురుమంది. చుట్టూ వెదుక్కుంది తల్లి గంపెడాశతో. కన్నకడుపు నిలువునా తరుక్కుపోయింది. నీళ్లలో చిట్టితల్లి గజ్జెలా-చంద్రంకి బొమ్మా స్పష్టంగా గోచరించేయి. ఏమి సృష్టి యిది?...నీళ్లు లేక ఒకజీవి, నీళ్లవల్ల ఒకజీవి ప్రాణాలు......

ఎంతట్లో ఎన్నిరోజులు తిరిగిపోయేయి! కాలగర్భం కడుపున పెట్టుకోకుండే యీసరికి—చిట్టితల్లి......

వేదాంతం!

"'లీల' అంటే 'మాయ' అంటున్నారు చూశావే మామ్మా!" అంటూ కం(ప్లెంటు చేసేను మా నాయనమ్మగారి దగ్గరకు వెళ్లి.

"లీల అంటే మాయే మరి; సృష్టి అంతా భగవంతుడి లీల అంటారు వినలే? అంటే మాయేను" అంది మా నాయనమ్మగారు కూడాను!

"'మాయ' అంటే?" అన్నాను నాకు ఉడుకుబోతుతనం మరింత యెక్కువై.

"మాయ అంటే మాయే—ఇంద్రజాలం లాంటిదన్న మాట!" అని మా అమ్మగారు అందుకుంది—వకాల్తానామా ఏమీ అక్కర లేకుండానే!

"చూడండి నాన్నగారూ! మామ్మా అమ్మా ఏమిటంటున్నారోను? లీల మాయ అట, సృష్టి అంతా భగవంతుడి లీలా మాయా నట!" అని మా నాన్నగారి దగ్గర ఫిర్యాదు చేసేనీసారి—ఇది ప్రీవీకౌన్సిలు అప్పీలు, ఇప్పుడైనా, మన ప్రక్కకే, తీర్పు అవుతుందన్న ఆశతోటి!

"అవునమ్మా! సృష్టి-స్థితి-లయాలు సృష్టికర్త లీలలంటారు. అంటే వేడుక కృత్యాలు:—

"పటుమతి వేడుక బొమ్మ రిండ్లిడుకలో
బాగొప్ప నిర్మించి, చా
వ్పడ (ముగ్గుల్ పవరించి, యాడుకొని,
యాపై నాటు గొల్లంచుఁ గ
ట్టడముల్ పా డొనరించి పోవుగతి,
వేడ్కల్ నీకు నివిశ్వముల్
పాదమంకేసి, భరించి,
మా పుటలు సెప్పన్........."

అన్నారు పెద్దలు" అన్నారు మా నాన్నగారు!

"లీల అంటే ఆట—వేడుక కృత్యాలు అన్నారు, ఇంకా అది బాగుంది; అంతే కాని మాయ అట! సృష్టి యీశ్వరుడిలీల అంటే అర్థముందిగాని మాయ అంటే!! అయితే.... ....మరి-మరి నేను వున్నానా? మీరు వున్నారా? మామ్మ ఉందా? కళ్లారా చూస్తుంటే మాయ ఎలాగౌతుందీ!" అన్నాను నేను.

"ఉన్నది లేనట్టు, లేంది ఉన్నట్టు తోచడమే మాయ అంది మా అమ్మగారు మళ్లీని. నేను జవాబు చెప్పబోతుంటే అంతట్లో మా నాన్నగారిలా గన్నారు:—

"పోనీ ఇలా చూడు—సాయంత్రం మనం బీచ్‌కి వెళ్లినప్పుడు చూచేవా—కెరటాలు ఎలా లేచి పడుతున్నాయోను? ఒక కెరటం మామ్మగారనుకో, దాన్నుంచి వచ్చిన మరొక కెరటం నేననుకో, దానిపిల్ల కెరటం నువ్వనుకో—కాని యీ కెరటాలు ఎక్కువ నిజమా? అవి దేన్నుంచి బయలుదేరేయో ఆ నీరు ఎక్కువ నిజమా? నిజానికి ఉన్నది నీరైతే దాన్ని మరిచి కెరటాల్నే నీవు ఎలా చూస్తున్నావో, అలాగే యీ సృష్టిలో నీవూ-నేనూ-మామ్మా-సమస్త వస్తు జాలమూ నంటారు పెద్దలు."

ఏమో అంత వేదాంతం నాకు బోధపడ లేదు. "లీల లీలేగాని మరొకటన్నారంటే నేనొప్పుకో"నని చెప్పేసా!

"అసలు, నీపేరే లీల! సార్థక నామధేయురాలవ"న్నారు అంతాను!

అ-ప్పు-డూ-రు-కు-న్నా-ను!!

—లీల—

★

అంతస్థు, నమ్రత సమ్మిళితమైనప్పుడే జీవితానికి శోభ కలుగుతుంది.
జమునక్కా, సుశీలక్కా మాకు "వార్డెన్" లుగా వుండడంవల్ల మాకీ
అదృష్టం కలిగింది.

1-12-46 తేదీని సాయంకాలం 5 గంటలకు శ్రీ లేడీ అల్లాడి కృష్ణస్వామిగారి అధ్యక్షతను శ్రీ మల్లమదేవి మహిళా మందిరం హాస్టల్ డే జరిగింది. శ్రీమతి వెంకటలక్ష్మిగారు హాస్టల్ కార్యదర్శిని, హాస్టల్ రిపోర్టు చదివేరు:—

"మా హాస్టలు చరిత్రలో మరో సంవత్సరం విజయవంతంగా గడిచింది. మాకే కాదు— యావదాంధ్రావనికీ చరిత్రాత్మకమైన సంవత్సరం! ఆంధ్ర చరిత్రను ప్రత్తేజపరచిన వీరనారి మల్లమదేవికి స్మారక చిహ్నం నెలకొల్పి ఆ దివ్యాత్మ ఆశీస్సులతో విజ్ఞాన సంపత్తిని చేకూర్చుకొనుటకు ఆంధ్రమహిళల కవకాశము కల్పించిన మా సభ ధన్యత గాంచింది. దీని కంతటికి మూల కారణమైన మా దుర్గాబాయమ్మగారికి ఆంధ్ర దేశం, ముఖ్యంగా, ఆంధ్ర బాలికలు ధన్యవాదాలు సమర్పించాలి.

మల్లమదేవి మహిళా మందిరంలో, సల్ల కైమంది వున్నాం! అన్ని జిల్లాల వారూ, అన్ని తరహాల వారూను—ఏక కుటుంబంలా మనసూ మనసూ కలసి పోయి. అందరకీ ఒకటే లక్ష్యం. మల్లమదేవి మందిరం ఆశ్రయ మిచ్చిన ప్రతీ విద్యార్థినీ ఆదర్శ ఆంధ్ర మహిళలాగ అభివృద్ధి పొందాలని మా ఆశయం. మేము గడిపే ప్రతి ఘడియా ఆ ఆదర్శ సాఫల్యానికే వినియోగపడేటట్లు చూసేందుకే మా జమునక్కా, మా సుశీలక్కా మా కష్టసుఖాలు పంచుకుంటూ, మా నడవడికి మెరుగు పెడ్తూ మాతోటే—విద్యార్థినీ జీవితం తిరిగి అలవరచుకొని—మా హాస్టలులోనే వుంటున్నారు. Dignity and Humility సమ్మిళితమైనప్పుడే జీవితానికి శోభ కలుగుతుంది—జమునక్కా, సుశీలక్కా మాకు "వార్డెన్" లుగా వుండడంవల్ల మాకీ అదృష్టం కలిగింది.

మా హాస్టల్ వార్షికోత్సవం

ఇరుకు ఇంటినుండి విశాల భవనానికి ఉనికి మార్చినా మా దైనందిన కార్యక్రమంలోని విశిష్టత సన్నగిల్లలేదు. సిరి అబ్బితే సౌమ్యం మరుపుకు వస్తుందన్న మాట వట్టి మాట అని రుజువు చేసాం. నాలుగు సంవత్సరాల క్రితం ఏయే వుద్దేశాలతో మా చిన్న కాపురాన్ని ప్రారంభించామో, నేడూ వాటినే పాటిస్తున్నాం.

మా హాస్టల్ యేపాటి! ఫర్నిచర్ లేదు. డైనింగ్ టేబిల్ లేదు. టాయిలేట్ రూమ్ లేదు తతిమా హాస్టల్సుతో మాకు సాపత్యమా, నలభై మందికి యిద్దరేనా కుక్కు లేరు, ఓయ్ అంటే పలకడానికి బోయ్ లేడు— యేమిటీ యిదంతా అంటే ఆంధ్ర మహిళాసభ హాస్టల్ యొక్క ప్రత్యేకతే యిది అని గర్వంతో చెప్తాం.

వంటింట్లో పనికూడా మాపైనే పెడ్తే చదువెల్లా సాగుతుంది, ఆకాలేజీ హాస్టల్ చూడండీ అని మమ్మల్ని యెక్కిరిస్తే ఎంత అమాయకత్వం అని నవ్వుకుంటాం. మా హాస్టల్ జీవితంలో స్వయంసేవకత్వం ప్రధానాశయం అని తెలిసికోవాలి.

ఇదేమిటీ, రోజుకోగంట నిర్బంధంగా నూలు తీయడమట ; యే హాస్టల్లోనైనావుందా యీ విడ్డూరం అంటే పాపం శమించు గాక అనుకుంటాం. నిర్బంధం అనేది మా Hostel Dictionery లో లేదు. కాని అంతా క్రమశిక్షణకు అలవాటు పడిపోయాం. మాకిదంతా అసలు, శిక్షణగా వుండదు. ఇంట్లో ఉన్నట్లే నడుచుకుంటాం.

మా దుర్గాబాయమ్మగారు రోజూ మేం క్లాసుల్లోంచి రాగానే, ఎవరితో వకరితో మాట్లాడుతూ కనపడతారు. ఒక్క రోజు వారు కనపడకపోతే, మాకు మా అమ్మల్ని వదలి పెట్టినప్పుడు, ఏలా బెంగపడతామో, అలా ఉంటుంది. వారి ఆదరాభిమానాలతో మా యిండ్లని మరిపించేస్తారు. వారి దగ్గర మాకు ఎంత చనువో అంత భయమూ భక్తీనూ. ఏదైనా వారి దగ్గర చెప్పాలంటే, నిమ్మళంగా అమ్మమ్మగారి దగ్గరకు చేరుతాము. పని తొందరలలో దుర్గాబాయమ్మగారు రాకపోయినా మా అమ్మమ్మగారిని, రాట్నాన్ని చూసినా మాకానందమే. మా Seniors పరీక్షలు పరుగెత్తుకొని వస్తున్నాయి. అందుకు హాస్టలు విడిచిపెట్టి వెళ్లాలన్న బెంగ వకటి, రెండోది వెళ్లే సమయానికి మా దుర్గాబాయమ్మగారు రైలు దాకవచ్చి మాకు ధైర్యము చెప్పి పంపటానికి ఉండరేమోనని ఒకటి భయం.

అయినా, వారు ఢిల్లీలో వున్నా, వారి ఆశీస్సులు ఆదరణ మాకు చేరుతునే వుంటాయన్న ధైర్యంతో మా కార్యక్రమం విజయవంతంగా జరుగుతుందని విశ్వసిస్తున్నాం.

వసతి గృహ జీవితం

* శ్రీమతి మంత్రిప్రగడ రంగనాయకమ్మగారు *

ఆంధ్ర మహిళాసభ విద్యార్థినుల ద్వితీయ వార్షికోత్సవసందర్భంలో శ్రీమతి మంత్రిప్రగడ రంగనాయకమ్మగారు యీ విధంగా వుపన్యసించారు.

"విశ్వ విద్యాలయములు, కళాశాలలు సంఘ జీవితమును పదును పరచుననుటలో సంశయము లేదు. కాని, కళాశాలలందు నేర్చు విద్య పుస్తకగతమయినది. స్వానుభవమువలన నేర్చినది కాని, ఇతరుల సాంగత్యమువలన నేర్చినది కాని తక్కువగనుండును. ప్రతి విద్యాలయమునకు వసతి గృహముల యేర్పాటు యుండిన, అట్టి విద్యాలయములందు సంపాదించు జ్ఞానము అనుభవముతో కూడుకున్నదై సర్వతోముఖముగనుండును. పలు దేశములనుండి పలువురు విద్యార్థులు, కళారాధులు ఒకే గృహమున సమావేశమయి, యేకోదర భావముతో ఒక కుటుంబమువలె ప్రవర్తించెదరు. ఈ విద్యార్థినుల వసతి గృహములందు తగు మాత్రపు నిబంధనలకు లోబడి విద్యాభ్యాసకాలము గడుపుదురు. ఇచ్చట చాల ముఖ్యమగు విషయములను నేర్చుకొనుటకు సావకాశమున్నది. పరస్పర మైత్రివలన సంఘీభావము యేర్పడును. హెచ్చుతగ్గులు, మత వైషమ్యములు మొదలగునవి చూపుట యుండదు. ఏక పంక్తిని భోజనము చేసి, ప్రతి పనిని నల్వురితో కలసి చేయుటవలన ఉత్సాహకరముగనుండును. అందరును యేక మనస్కులై విద్యాభిలాషతో నొక్క ప్రదేశమున చేరుటవలన నేకీభావము కలుగును; ఒకరి సాంగత్యమువలన నింకొకరు నేర్చుకొనునవి చాల యున్నవి. దేశ, భాష, మత, ఆచార పద్ధతులు భేదముగనుండినను పరస్పర సాంగత్య బలముచే, మంచి విషయములను గ్రహించి దుష్టాచారములను త్యజించకలుగు మనోవిస్తృత యేర్పడి విశాల హృదయుల మగుదుము.

ఇట్టి ఆశయములను అనుభవములోనికి తెచ్చుకొనుటకు, విద్యాశాలలు, కళాశాలలు, పాఠశాలలు యెంత సహాయకమగు చున్నవో, వాటి ననుసరించి స్థాపించు విద్యార్థినీ వసతి గృహములు అంతకన్న యెక్కువ తోడ్పడుచున్నవి. విద్యాభ్యాసకాలమునందు తప్ప తక్కిన వేళలందు తమ యింటి నాల్గు గోడల మధ్య గడుపు జీవనము కంటె, క్రీడారామములందు, పుస్తకాలయములందు భోజన గృహమునందు అందరు ఒక సమితిగనుండి జీవనము గడుపు వసతి గృహములందలి జీవనము చాల విశాలమయినది. కనుక ఆంధ్ర స్త్రీలు, విద్యార్థినులు తాము వసతి గృహములందు గడుపు జీవనము చాల ముఖ్యమయిన ఈ అవకాశమును దీసికొని తమ బాధ్యతను నిర్వహించుచుందురని నా నమ్మకము."

★

అద్వితీయ ప్రజాదరణ పొందిన

తెలుగు సాంఘిక చిత్రము



★ లక్ష్మీరాజ్యం ★ ప్రభాకర్ నటించినది

కథ చమత్కారమునకు - సంభాషణలకు - సంగీతమునకు

యిటువంటి చిత్రము యింతవరకు రాలేదని ప్రజాభిప్రాయం.

ది 12-12-46 మొదలు
4 వ వారం

బెజవాడ : మారుతీ

తెనాలి : రత్నా

రాజమండ్రీ : కృష్ణా

బందరు : మినర్వా

ది 6–12–46

మొదలు గుంటూరు : న్యూబొంబే

ది 19–12–46

మొదలు విజయనగరం : పూర్ణా

ది 29–11–46

మొదలు అనంతపురం : ఎక్సెల్సియర్

DISTRIBUTORS FOR ANDHRA CEDED AND NIZAMS

CHAMRIA TALKIE DISTRIBUTORS

MADRAS :: BEZWADA :: GUNTAKAL :: SECUNDERABAD